



# విశ్వంవాయిస్

అవినీతిపై- అక్షరసమరం...

తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY









SIMULTANEOUSLY PUBLISHED FROM EAST GODAVARI DISTRICT, CERCULATED AT IN WEST GODAVARI, VISAKHAPATNAM, SRIKAKULAM, VIJAYANAGARAM, VIJAYAWADA, HYDERABAD, BANGLORE, CHENNAI, DELHI, MUMBAI, TIRUPATHI, ANANTAPUR, GUNTUR, KADAPA, KHAMMAM, KARIMNAGAR, KURNOOL, NELLORE, NIZAMABAD, ONGOLE

సంపుటి : 8 సంచిక : 169 అమలాపురం ఎడిటర్ : కె. సునీల్‌కుమార్ శుక్రవారం 28 ఫిబ్రవరి 2025 పేజీలు : 12 వెల : 2/-


# మెగా మే మంత్



**అమరావతి, విశ్వంవాయిస్ న్యూస్ :**
ఏపీలో ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న సంక్షేమ పథకాలకు ముహూర్తం ఫిక్స్ అయింది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడే స్వయంగా ఈ విషయాన్ని ప్రకటించారు. తన ఎన్నికల హామీలైన తల్లికి వందనం, అన్నదాతా సుఖీభవ, మత్స్యకారుల భరోసా వంటి మూడు కీలక పథకాలు ఎప్పుడు ప్రారంభించేది వెల్లడించారు. అధికారంలోకి వచ్చిన తొమ్మిది నెలలు అవుతున్నా హామీలు అమలు చేయడం లేదన్న విమర్శల నడుమ.. మరో రెండు నెలల్లో మూడు పథకాలను అమలు చేస్తున్నట్లు ప్రకటించారు. దీంతో వస్తున్న మే నెల మెగా మంత్ అంటూ కూటమి కార్యకర్తలు సంబరాలు చేస్తున్నారు. ఏపీలో టీడీపీ కూటమి గ్రాండ్ విక్టరీ అందించిన సూపర్ సిక్స్ పథకాల్లో ప్రధానమైనది తల్లికి వందనం. ఇంట్లో ఎంతమంది పిల్లలు ఉంటే అందరికీ 15 వేల చొప్పున ఆర్థిక సాయం చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు తన ఎన్నికల ప్రచారంలో ప్రకటించారు. అంతేకాకుండా రాష్ట్ర జలవనరుల మంత్రి నిమ్మల రామానాయుడు తన ఎన్నికల ప్రచారంలో.. పిల్లలను ఉద్దేశించి నీకు 15 వేలు.. నీకు 15 వేలు.. నీకు 15 వేలు అంటూ తల్లిదండ్రులకు హామీ ఇవ్వడం వైరల్ అయింది. అయితే గత విద్యా సంవత్సరం ఆరంభంలో అధికారంలోకి వచ్చిన కూటమి ఆర్థిక పరిస్థితులపై అంచనా లేకపోయడంతో అమలు చేయలేకపోయింది. ఇదే అదునుగా ప్రతిపక్షం విమర్శలు గుప్పిస్తూ వస్తోంది. ఈ పరిస్థితుల్లో వచ్చే మే నెలలో తల్లికివందనం పథకం అమలు అవుతుందని ముఖ్యమంత్రి చంద్రబాబు స్వయంగా ప్రకటించడంతో విమర్శలకు చెక్ పెట్టినట్లైంది. ఇక అన్నదాతా సుఖీభవ పథకం కోసం రైతులు ఎదురుచూస్తున్నారు. ప్రతి రైతుకు ఏడాదికి రూ.20 వేల అందజేస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చారు. కానీ, ఆర్థిక సమస్యల వల్ల 9 నెలలుగా ఈ పథకాన్ని అందజేయలేకపోయారంటున్నారు. దీనిపైనా ప్రతిపక్షం విమర్శలు ఎక్కుపెట్టింది. అయితే కూటమి మాత్రం అన్ని భరిస్తూ తగిన సమయంలోనే పథకాలు అంటూ చెప్పుకొచ్చింది. ఇక జూన్ లో ఖరీఫ్ ప్రారంభం అవుతుందని కనుక రైతుకు పెట్టుబడి సాయంగా మే నెలలోనే డబ్బులు వేస్తామని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. రైతు భరోసా కింద కేంద్ర ప్రభుత్వం ప్రతి రైతుకు ఏడాదికి ఆరు వేల రూపాయలు చెల్లిస్తుంది. ఇది మూడు విడతలుగా రైతుల అకౌంట్లలో జమ చేస్తారు. ఈ మొత్తానికి అదనంగా మరో రూ.14 వేలు కలిపి మొత్తం రూ.20 వేలు చెల్లించేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. కేంద్ర ప్రభుత్వం చెల్లిస్తున్న పద్ధతిలోనే రైతులకు మూడు విడతలుగా ఈ రూ.20 వేలు అందుతుంది. అదేవిధంగా మే నెలలో మరో కీలక పథకం అమలుకూ ముఖ్యమంత్రి చంద్రబాబు సమ్మతి తెలియజేశారు. అదే

మిగతా 2

# నాటో మాట మర్చిపో !

## ఉక్రెయిన్‌కు ట్రంప్ క్లియర్ కట్ మెసేజ్



**వాషింగ్టన్ :** నార్త్ అట్లాంటిక్ ట్రీటీ ఆర్గనైజేషన్ (నాటో).. ఇదొక సైనిక కూటమి. ఇందులో సభ్యులైన దేశాలు అన్నీ ఒప్పుకొంటేనే మరో కొత్త సభ్య దేశాన్ని చేర్చుకునే అవకాశం ఉంటుంది. ఏ ఒక్క దేశం వ్యతిరేకించినా.. కొత్తగా మరో దేశాన్ని చేర్చుకునే వీలుండదు. ఇక కూటమిలోని సభ్య దేశాలపై ఏదైనా బయటి దేశం దాడి చేస్తే.. అది 'నాటో'పై చేసే దాడిగానే పరిగణించి 'నాటో' సైన్యమే నేరుగా

# బీజేపీ మాస్టర్ ప్లాన్

## 60 ఏళ్లు దాటిన అందరికీ పెన్షన్!



**న్యూఢిల్లీ, విశ్వంవాయిస్ న్యూస్ :** కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం భారీ సంక్షేమ పథకానికి శ్రీకారం చుట్టబోతోంది. ఇప్పటికే సామాజిక పెన్షన్లను అందజేస్తున్న ప్రభుత్వం.. 60 ఏళ్లు దాటిన ప్రతి ఒక్కరికీ సామాజిక భద్రత కొనసాగించే స్కీంకి రూపకల్పన చేస్తోందని చెబుతున్నారు. 2014లో అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం.. ప్రతి ఎన్నికకు ఏదో ఒక భారీ స్కీమ్ తో వెళుతోంది. అయోధ్య

# రైళ్లలో మహిళల భద్రతకు 'వాట్సాప్ గ్రూప్'?



**చెన్నై :** మహిళ సురక్షితంగా ప్రయాణించేలా 'వాట్సాప్' గ్రూప్ ఏర్పాటు చేయాలని రాష్ట్ర రైల్వే పోలీసులు నిర్ణయించారు. రైళ్లలో ప్రయాణిస్తున్న మహిళలపై లైంగిక వేధింపులు, సెల్‌ఫోన్, చైన్ స్నాచింగ్ ఘటనలు అధికమవుతున్నాయి. రాత్రి సమయాల్లో స్టేషన్‌లో ఒంటరిగా ఉంటున్న మహిళలు, రైళ్లలో ఒంటరిగా ప్రయాణించే మహిళలపై వేధింపులు జరుగుతున్నాయి. ఈ చర్యలు అడ్డుకొనేలా రైల్వేస్టేషన్లు, రైళ్లలో పోలీసు భద్రత పెంచారు. ఈ నేపథ్యంలో, సబర్బన్, ఎక్స్‌ప్రెస్ రైళ్లలో తరచూ ప్రయాణించే మహిళలను గుర్తించి, వారితో వాట్సాప్ గ్రూప్ ఏర్పాటు చేయాలని రైల్వే పోలీసులు నిర్ణయించారు. రైల్వేస్టేషన్లు,

# హిందీ వల్ల 25 భాషలు కనుమరుగు


## మళ్లీ బాంబ్ పేల్చిన స్టాలిన్



**చెన్నై :** తమిళులు భాషా ప్రేమికులు.. తమ తమిళం కోసం ప్రాణాలైనా ఇస్తారు.. హిందీ అంటే తీవ్రంగా వ్యతిరేకిస్తారు. అందుకే ఏ తమిళ ప్రముఖుడు అయినా సరే హిందీలో మాట్లాడడు. తమిళం.. ఇంగ్లీష్ నే అక్కడ ఎక్కువ వాడుతారు. హిందీ వ్యతిరేక ఉద్యమాలు తమిళనాడులో ఎన్నో జరిగాయి. తాజాగా కొత్త విద్యావిధానంలో హిందీని తప్పనిసరి

# ఓటెత్తిన ఉత్తరాంధ్ర

## 86 శాతం పోలింగ్!



**విశాఖపట్నం, విశ్వంవాయిస్ న్యూస్ :** ఏపీలో జరుగుతున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఉత్తరాంధ్ర జిల్లాల ఓటర్లు తమ చైతన్యం చూపించారు. విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం జిల్లా పరిధిలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికకు పోలింగ్ జరుగుతోంది. ఉదయం

మిగతా 2

# పిఠాపురంలో రగడ!

## పవన్ కల్యాణ్‌కు ముంచుకొస్తున్న ప్రమాదం?



**పిఠాపురం, విశ్వంవాయిస్ న్యూస్ :**
ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌కు ఇది ఒకరకంగా బ్యాడ్ న్యూసేనని చెప్పాలి. ఆయన ప్రాతినిధ్యం వహిస్తున్న పిఠాపురం నియోజకవర్గంపై కేంద్ర ఎన్నికల సంఘం దృష్టి పెట్టింది. అంతేకాదు.. ప్రత్యేక అధికారులను హుటాహుటిన అక్కడకు పంపిస్తున్న ఏపీ ఎన్నికల ప్రధాన అధికారి వివేక్ యాదవ్ మీడియాకు చెప్పారు. దీంతో పిఠాపురం నియోజకవర్గంలో ఏం జరుగుతోందన్న విషయం ఆసక్తిగా మారింది. ఏం జరుగుతోంది? ఏపీలో గురువారం పట్టభద్ర, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల

మిగతా 2



# రేవంత్ టాలెంటే వేరు

## మోడీతో ఫోటో వేళ మంత్రి శ్రీధర్ బాబు

**హైదరాబాద్, విశ్వంవాయిస్ న్యూస్ :** తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యవహారశైలి సమకాలీన సీఎంలకు కాస్త భిన్నంగా ఉంటుందని చెప్పాలి. బీజేపీయేతర ముఖ్యమంత్రుల్లో అత్యంత చురుగ్గా ఉండటమే కాదు.. తరచూ ఢిల్లీకి వెళ్లి కేంద్ర పెద్దలతో భేటీ కావటం.. రాష్ట్రానికి అవసరమైన పనుల గురించి అడిగి చేయించుకోవటం కనిపిస్తుంది. బీజేపీతో ఏ మాత్రం పొసగని కాంగ్రెస్ పార్టీలో ఉండి కూడా ప్రధాని నరేంద్ర మోడీ అపాయింట్ మెంట్ ను ఇట్టే పొందే సీఎంగా ఆయనకు మంచి పేరే ఉంది. తాజాగా మరోసారి ఆయన ప్రధాని నరేంద్ర మోడీని కలవటం.. ఆయనకు రాష్ట్ర అవసరాల గురించి

మిగతా 2

# పాకిస్థాన్‌కు అంత స్థాయి లేదు



**న్యూఢిల్లీ, విశ్వంవాయిస్ న్యూస్ :**
ప్రజాస్వామ్యం అణిచివేత, మానవ హక్కుల ఉల్లంఘన మొదలైన విషయాలపై పాకిస్థాన్ స్పందించింది. అది కూడా ఐక్య రాజ్య సమితి మానవ హక్కుల మండలిలో జమ్మూకశ్మీర్ లో భారత్ వల్ల అవి పోతున్నాయని చెప్పుకొచ్చింది. పాక్ నోట ఇలాంటి మాటలు రావడం ఒకెత్తు అయితే.. అవి తమపై విమర్శలుగా మారడంపై భారత్.. గట్టిగా ఇచ్చి పడేసింది. అవును... ఐక్యరాజ్యసమితి వంటి అంతర్జాతీయ వేదికలపై భారత్ పై పాకిస్థాన్ తరచూ తన అక్కసు వెళ్లగక్కుతూనే ఉన్న సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా... గతంలో ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీలో భారత్ పై నిరాధారమైన, దురుద్దేశపూరితమైన ప్రచారం చేసింది పాకిస్థాన్

మిగతా 2


# జనసేనలోకి బిగ్‌షాట్ ?



**అమరావతి, విశ్వంవాయిస్ న్యూస్ :**
జనసేన ఈసారి ప్లీనరీ మామూలుగా ఉండే చాన్సే లేదు అంటున్నారు. పార్టీలోకి భారీ జాయినింగ్స్ తో మోతెక్కించేలా ప్లాన్ చేశారు అని అంటున్నారు. మార్చి 14 జనసేన ఆవిర్భావ దినోత్సవం. ఆ రోజున పెద్ద ఎత్తున ఇతర పార్టీల నుంచి నాయకులు జనసేనలో

మిగతా 2

# జగన్ ఫ్యూచరేంటి ?



**అమరావతి, విశ్వంవాయిస్ న్యూస్ :**
ప్రధాన ప్రతిపక్ష హోదా దక్కే అవకాశం లేదు. ఇది ఇస్తే తప్ప అసెంబ్లీకి వచ్చేది లేదని జగన్ ప్రకటన. ఈ రెండు పరిణామాల మధ్య ఏపీ ప్రతిపక్షం వైసీపీ నలిగిపోతోంది. ఒకవైపు కూటమి సర్కారు పంతం.. మరోవైపు.. తమ పార్టీ అధినేత భీషణ ప్రతిజ్ఞల తో వైసీపీ కేడర్ సహా ఎమ్మెల్యేలు కూడా నలిగిపోతున్నారు. ఇదే పరిస్థితి కొనసాగుతుందని అనుకున్నా.. ఇదేమీ రేపో మాపో తేల్చే అంశం కాదు. తేలే అంశం కూడా కాదు. మరో 4 సంవత్సరాలకు పైగానే వ్యవహారం సాగనుంది. మరోవైపుఈ కేసు కోర్టులో ఉందని అనుకున్నా.. నిర్ణీత కాల వ్యవధిలో ఈ కేసును పరిష్కరించాలన్న నియమాలేమీ కోర్టుకు లేదు. దీంతో వైసీపీ ఎమ్మెల్యేలు అంతర్మథనం చెందుతున్నారు. మరో వైపు.. కూటమి కూడా బలంగా ఉండడం... తమ బంధం మరింత బలపడుతుందన్న వాదనలు చేయడం

మిగతా 2

# మార్చి 8న జాతీయ లోక్‌అదాలత్

## కార్యక్రమాన్ని జయప్రదం చేయండి

## అదనపు జిల్లా సెషన్స్ కోర్టు జడ్జి శంకరరావు



**రామచంద్రపురం విశ్వం వాయిస్ న్యూస్ :** రామచంద్రాపురం 13వ అదనపు జిల్లా మరియు సెషన్స్ కోర్టు జడ్జి ఎం.శంకర రావు పిలుపునిచ్చారు. గురువారం సాయంత్రం అదనపు జిల్లా కోర్టు ప్రాంగణంలో న్యాయవాదులతో ఆయన సమావేశం ఏర్పాటు

మిగతా 2

# పోలింగ్ కేంద్రానికి 100 మీటర్ల పరిధిలో ఎటువంటి ప్రచారాలు నిర్వహించ రాదు

## పోలింగ్ నిర్వాహణ తీరు, సరళిని పర్యవేక్షించిన జిల్లా జాయింట్ కలెక్టర్ టి నిషాంతి



**అమలాపురం టౌన్, విశ్వంవాయిస్ న్యూస్ :** ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల శాసన మండలి పట్టభద్రుల ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా శాంతియుత వాతావరణంలో నిర్వ హించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ టీ నిషా%శీ%తి పోలింగ్ సిబ్బందికి సూచించారు .ఆమె గురువారం స్థానిక తాసిల్దార్ కార్యాలయం లో ఏర్పాటు చేసిన 213 పోలింగ్ కేంద్రాన్ని సం దర్శించి పోలింగ్ నిర్వ హణ తీరు, సరళిని పర్యవేక్షించారు. అదే విధంగా పోలింగ్ కేంద్రం పరిసర ప్రాంతాలలో పర్యటించి పోలింగ్ కేంద్రానికి 100 మీటర్ల పరిధిలో ఎటువంటి ప్రచారాలు నిర్వహిం చరాదని వ్యక్తులు గుంపులుగా సంచరించ కుండా శాంతిభద్రతలను కాపాడేందుకు

మిగతా 2

# ఎడిటర్ వాయిస్

## విద్వేష క్రతువు

విశ్వ హిందూ పరిషత్ (విహెచ్‌పి) ఆదివారం నాడు విజయవాడ సమీపంలోని కేసరపల్లిలో నిర్వహించిన హైందవ శంఖారావం సమాజంలో విద్వేషాలు నూరిపోసేందుకు ఉద్దేశించిన క్రతువులా అనిపిస్తోంది. సభా వేదిక మీద నుంచి చేసిన ప్రసంగాలు ఆ లక్ష్యంగానే సాగాయి. భవిష్యత్ కార్యాచరణను నిర్దేశిస్తూ ప్రకటించిన డిక్లరేషన్ ఆసాంతం సమాజంలో అలజడి రేపేదిగా ఉంది. హిందూ దేవాలయాల నిర్వహణను హిందూ సమాజానికే అప్పగించాలన్నది డిక్లరేషన్ ప్రధాన డిమాండ్. గుళ్లను ప్రభుత్వ నియంత్రణ నుంచి తప్పించి స్వయంప్రతిపత్తి కల్పిస్తూ చట్టం చేయాలన్నారు. ఆక్రమణలకు గురైన దేవాలయ భూములను ప్రభుత్వం తిరిగి ఆయా దేవాలయాలకు అప్పగించకపోతే బలవంతంగా స్వాధీనం చేసుకుంటామని హెచ్చరించారు. దేవాలయ సంస్థల్లో పని చేస్తున్న అన్య మతస్థులను తక్షణం తొలగించాలని అల్టిమేటం జారీ చేశారు. పండగలు, శోభాయాత్రల వంటి వాటిపై ఆంక్షలొద్దే వద్దని హూంకరించారు. తమ డిక్లరేషన్‌ను సాధించుకునేందుకు ఉద్యమం లేవదీస్తామని హెచ్చరించారు. ఆ విధంగా ప్రతిజ్ఞ సైతం చేయించారు. శంఖారావం డిక్లరేషన్ పూర్తిగా రాజ్యాంగ విరుద్ధమైనది. ప్రజా వ్యతిరేకమైనది. ఈ డిక్లరేషన్‌ను ప్రజాస్వామ్య వాదులంతా అభిశంసించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. దేవాలయాలపై పెత్తనం కోసమే విహెచ్‌పి ఒక పథకం ప్రకారం పని చేస్తోందని డిక్లరేషన్ బట్టి అర్థమవుతుంది. చరిత్రను పరిశీలిస్తే ఏ మతానికి చెందిన ప్రార్థనా మందిరాలైనా రాజులు, జమిందార్లు, ఆ తర్వాత బ్రిటిష్ ప్రభుత్వాల పరిధిలోనే ఉన్నాయి. లౌకిక దేశంలో ప్రభుత్వాల పరిధిలోనే ఉండాలి కూడా. రాజ్యాంగం పౌరులందరికీ మత స్వేచ్ఛ ఇచ్చింది. దానికి పరిమితులూ విధించింది. దేవాలయ వైదిక క్రతువుల్లో ప్రభుత్వ జోక్యం ఉండరాదు. వాటి పరిధిలోని విద్యాలయాలు, వైద్యశాలలు ఇతర సంక్షేమ కార్యక్రమాలు పరిపాలన, నిర్వహణ, వంటి లౌకిక వ్యవహారాలను ప్రభుత్వం చూడాలి. ప్రభుత్వ నియంత్రణ వలన ఆలయాలు అపవిత్రం అవుతున్నాయి కనుక వాటి నుంచి విముక్తి కల్పించాలనడం రాజ్యాంగాన్ని వ్యతిరేకించడమే. దేవాలయాలకు వెనకటి రాజులు, పోషకులు, జమీందార్లు, భక్తులు విలువైన ఆస్తులను అందించారు. వాటన్నింటి కబ్జా కోసమే ఈ ఆలయాల స్వాధీనం డిమాండ్‌గా కనిపిస్తోంది. ఉత్తరప్రదేశ్‌లోని యోగి ఆదిత్యనాథ్ ప్రభుత్వమే యు.పి లో దేవాలయాలన్నింటినీ ప్రభుత్వ అధీనంలోకి తెస్తూ చట్టం తెచ్చింది. అయోధ్య రామాలయం ట్రస్టులో ప్రభుత్వ ప్రతినిధులున్నారు. ప్రభుత్వ పర్యవేక్షణ ట్రస్టుపై ఉంది. ప్రధాని మోడీ ప్రాతినిధ్యం వహిస్తున్న కాశీలోని విశ్వేశ్వరస్వామి ఆలయం ట్రస్టు సైతం ప్రభుత్వ పరిధిలోనే నడుస్తోంది. కానీ ఆంధ్రప్రదేశ్‌లో మాత్రం ఆలయాలను ప్రభుత్వ చెర నుంచి విముక్తికి పోరాడతానంటోంది విహెచ్‌పి. ఈ రెండు నాల్కల వైఖరేంటి? శంఖారావాన్ని విహెచ్‌పి నిర్వహించినా బిజెపి ప్రధాన శక్తి అన్నది బహిరంగ రహస్యం. బిజెపి రాష్ట్ర అధ్యక్షులు పురందేశ్వరి, పార్టీ ఎంపిలు, ఎంఎల్‌ఎలు, ఎంఎల్‌సిలు, పలువురు మాజీ ప్రజాప్రతినిధులు హాజరు కావడం ద్వారా అసలు విషయం అర్థమైపోతుంది. ఎపిలో బిజెపి ఉనికి కోసం ఎప్పటి నుంచో వెంపర్లాడుతోంది. కూటమి ప్రభుత్వంలో ఆ పని చేయాలని పథకం వేసింది. బిజెపి పెరగాలంటే దాని సహజ సిద్ధ ఎజెండా ప్రజల మధ్య విద్వేషాలు రాజేయడం. విహెచ్‌పి డిక్లరేషన్‌ను అందుకు ఉపయోగపెట్టుకోవాలని ప్రయత్నిస్తోంది.



ఎడిటర్ : కె. సునీల్‌కుమార్

(మొదటిపేజీ తరువాయి)

## నాటో మాట మర్చిపో !

రంగంలోకి దిగుతుంది. ఇంతటి క్లిష్టమైన నాటో సభ్యత్వాన్ని ఇస్తామని ఊరించి ఉక్రెయిన్‌ను రష్యాకు వ్యతిరేకంగా మార్చాయి పాశ్చాత్య దేశాలు. ఉక్రెయిన్ గనుక నాటో సభ్యరాలు అయితే నాటో దళాలు ఆ దేశంలో ఉంటాయి. అంటే.. ఆగర్భ శత్రువైన అమెరికా ఆధ్వర్యంలోని సైనిక బలగాలు రష్యా పొరుగునే ఉన్నట్లు. అందుకనే రష్యా అధ్యక్షుడు పుతిన్.. ఉక్రెయిన్ పై ఉరిమారు. మూడేళ్ల కిందట యుద్ధం మొదలుపెట్టి ఉక్రెయిన్ ను సర్వ నాశనం చేశారు. యుద్ధం మొదలైన తొలినాళ్లలో ఉక్రోయిన్ కు నాటో సభ్యత్వం అదిగో ఇదిగో అంటూ ఊరించిన అమెరికా, నాటో దేశాలు ఇప్పటికీ దానిని తేల్చలేదు. తాజాగా ఉక్రెయిన్ ఇక నాటో సభ్యత్వాన్ని మర్చిపోవచ్చంటూ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తేల్చిచెప్పారు. ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్ స్కీ త్వరలో తనతో భేటీ కానున్నట్లు వెల్లడించారు. అధికారంలోకి వచ్చాక తొలిసారి కార్యవర్గంతో సమావేశమైన ట్రంప్.. ఉక్రెయిన్ సమస్యపై స్పందించారు. 'నాటోనా..? దానిని మర్చిపోవచ్చు. సంక్షోభం అంతా దాంతోనే మొదలైంది. మేం అత్యుత్తమ పనే చేయాలని భావిస్తున్నాం. ఇద్దరికీ (రష్యా-ఉక్రెయిన్) ఉత్తమ సంధి కుదురుస్తాం. ముఖ్యంగా ఉక్రెయిన్ కు మంచి సంధి కుదిరేలా చేసి.. కోల్పోయిన దానిలో.. వీలైనంత ఎక్కువ వెనక్కు ఇప్పిస్తాం" అని ట్రంప్ అన్నారు.

## బీజేపీ మాస్టర్ ప్లాన్

రామమందిరం, ఈబీసీలకు రిజర్వేషన్లు, ఆర్టికల్ 370 రద్దు వంటి సంచలన పథకాలను గతంలో ప్రవేశపెట్టిన బీజేపీ ప్రభుత్వం 2029లో జరిగే ఎన్నికలకు ఇప్పటి నుంచే మాస్టర్ ప్లాన్ రెడీ చేస్తోంది. భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని బీజేపీ వేస్తున్న ఈ మాస్టర్ ప్లాన్ విశేషంగా ఆకర్షిస్తోంది. దేశంలోని ప్రజలు అందరికీ కొత్త పింఛను పథకం తీసుకురావాలని కేంద్ర ప్రభుత్వం భావిస్తోంది. అసంఘటిత రంగంలోని వారితో సహా పౌరులందరికీ ప్రయోజనం కల్పించే ఉద్దేశంతో సార్వత్రిక పింఛను పథకంపై కేంద్రం కసరత్తు చేస్తోందని కార్మిక మంత్రిత్వశాఖ వర్గాలు తెలిపాయి. ప్రస్తుతం అసంఘటిత రంగానికి చెందిన నిర్మాణ రంగ కార్మికులు, గిగ్ వర్కర్లకు సంబంధించి ప్రభుత్వం నిర్వహిస్తోన్న పెద్ద పొదుపు పథకాలేవీ లేవు. ఇప్పటికే అమలులో ఉన్న ఈపీఎఫ్ వో వంటి పథకాల్లో ఉద్యోగులు, వారు పనిచేసే సంస్థ నుంచే చందాలు చెల్లిస్తారు. వీటిలో ప్రభుత్వం నుంచి ఎలాంటి వాటా జమకాదు. పెట్టుబడిదారుడికి 60 ఏళ్లు నిండిన తర్వాత నెలకు రూ.1000 నుంచి రూ.1,500 రాబడిని అందించే అటల్ పెన్షన్ యోజన, వీధి వ్యాపారులు, భవన నిర్మాణ కార్మికులకు ప్రయోజనం చేకూర్చే ప్రధాన మంత్రి శ్రమ్ యోగి మన్ ధన్ యోజన (పీఎం-ఎస్‌ఐఎం)తోపాటు 60 ఏళ్లు నిండిన రైతులకు నెలకు రూ.3 వేలు అందించే ప్రధాన మంత్రి కిసాన్ మన్ ధన్ యోజన వంటి పథకాలు ప్రస్తుతం అమలులో ఉన్నాయి. వీటికి కొంత మొత్తం ప్రజలు చెల్లిస్తుండగా, మరికొంత ప్రభుత్వం భరిస్తోంది. అయితే ప్రస్తుతం ఇలాంటి పరిస్థితే ఎదుర్కొంటున్న అమెరికా, కెనడా, యూరప్, రష్యా, చైనాల్లో అమలు చేస్తున్న పెన్షన్ స్కీమ్, ఆరోగ్య సంరక్షణ, నిరుద్యోగ ప్రయోజనాలను కవర్ చేసే సామాజిక భద్రతా వ్యవస్థలను ఏర్పాటు చేశాయి. ఇక డెన్మార్క్, నార్వే, స్వీడన్, నెదర్లాండ్స్, న్యూజిలాండ్ దేశాలు సార్వత్రిక పెన్షన్ పథకాలను అందిస్తున్నాయి. ఈ నేపథ్యంలో భవిష్యత్తును పరిగణించి మనదేశంలోనూ సామాజిక భద్రత కల్పించేలా 60 ఏళ్లు పైబడిన ప్రతి ఒక్కరికీ ఒకే పింఛను పథకం అందుబాటులోకి తీసుకురావాలని ప్రభుత్వం భావిస్తోంది. ప్రస్తుతం దేశంలో ఉన్న పొదుపు పింఛను పథకాలను హేతుబద్ధీకరించి ఈ కొత్త కార్యక్రమాన్ని అమలు చేసే అవకాశం ఉందని కార్మిక శాఖ వర్గాలు వెల్లడించాయి. ఉద్యోగం చేస్తున్న వేతన జీవులతోపాటు స్వయంఉపాధి పొందుతున్న వారికి కూడా కొత్త విధానం వర్తించేందుకు వీలుగా ఈపీఎఫ్ వో ఆధ్వర్యంలో విధివిధానాలు రూపొందిస్తున్నారు. ప్రస్తుతానికి న్యూ పెన్షన్ స్కీం అని పిలిచే ఈ కొత్త పథకం ఇప్పటికే అమలులో ఉన్న ఎన్పీఎస్ స్థానాన్ని భర్తీ చేయదని సమాచారం.

## రైళ్లలో మహిళల భద్రతకు

రైళ్లలో సంచరించే అనుమానాస్పద వ్యక్తుల వివరాలు, దోపిడీలు, వేధింపుల ఘటనపై సభ్యులు వాట్సాపలో పోస్ట్ చేసిన వెంటనే సత్వరం చర్యలు చేపట్టేందుకు ఈ గ్రూప్‌లు ఉపయోగపడతాయని అధికారులు తెలిపారు.

## హిందీ వల్ల 25 భాషలు

చేసిన కేంద్రంపై తమిళనాడులోని అధికార డీఎంకే, ప్రతిపక్షాలు పెద్ద యుద్ధమే ప్రకటించి బీజేపీని టార్గెట్ చేస్తున్నాయి. దేశంలో భాషలపై వివాదం కొత్తది కాదు. ముఖ్యంగా దక్షిణాది రాష్ట్రాల్లో హిందీ భాషను వ్యతిరేకించే భావజాలం బలంగా ఉంది. తాజాగా, కేంద్రంలోని భాజపా ప్రభుత్వం, తమిళనాడు అధికార పార్టీ డీఎంకే మధ్య హిందీ భాషపై మాటల యుద్ధం చోటు చేసుకుంది. తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ఈ వివాదాన్ని మరింత ఉధృతం చేస్తూ కీలక వ్యాఖ్యలు చేశారు. - హిందీ ప్రభావంతో భాషల నాశనం? తమిళనాడు సీఎం స్టాలిన్ హిందీ కారణంగా ఉత్తర భారతంలో 25 భాషలు కనుమరుగయ్యాయని ఆరోపించారు. గురువారం ఎక్స్ (మాజీ ట్విట్టర్) వేదికగా ఒక పోస్ట్ పెట్టిన ఆయన "భోజ్‌పురి, మైథిలీ, బుందేలీ, గర్వాలీ, కుమావోని, మాగాహి, మార్వారీ, మాల్వీ, ఛత్తీస్‌గఢి, సంథాలీ, అంజికా వంటి భాషలు మనుగడ కోసం పోరాడుతున్నాయి. ఉత్తరప్రదేశ్, బిహార్‌లు హిందీ రాష్ట్రాలు కావు. అక్కడ అసలు భాషలు గతంలోనే కలసిపోయాయి. తమిళనాడుకు అలాంటి పరిస్థితి రాకూడదనే మేము ప్రతిఘటిస్తున్నాం" అని పేర్కొన్నారు. కేంద్రం త్రిభాషా సూత్రం - తమిళనాడు వ్యతిరేకత జాతీయ విద్యా విధానం లో భాగంగా కేంద్ర ప్రభుత్వం విద్యార్థులు హిందీ, ఇంగ్లీషు, ఒక స్థానిక భాషను నేర్చుకోవాలని నిర్ణయించింది. అయితే, తమిళనాడు ప్రభుత్వం తాము ద్విభాషా విధానానికే కట్టుబడి ఉంటామని స్పష్టం చేసింది. హిందీని బలవంతంగా రుద్దే ప్రయత్నం చేస్తే దీన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించబోమని డీఎంకే ప్రభుత్వం చెబుతోంది. "తమిళ భాషకు, రాష్ట్రానికి, ప్రజలకు నష్టం కలిగించే చర్యలను అనుమతించబోము" అని స్టాలిన్ తేల్చి చెప్పారు. వివాదంపై భిన్న స్పందనలు ఈ భాషా వివాదం రోజురోజుకూ తీవ్రమవుతోంది. అయితే, తమిళగ వెట్రి కళగం పార్టీ అధ్యక్షుడు, ప్రముఖ నటుడు విజయ్ ఈ వివాదంపై స్పందించారు. "భాజపా, డీఎంకే మధ్య మాటల యుద్ధం చిన్నపిల్లల కొట్లాటలా మారింది" అని వ్యాఖ్యానించారు. ఆయన మాటలు ఈ వివాదాన్ని కొత్త మలుపు తిప్పాయి. - హిందీ లొల్లి ఎటువైపు తీసుకెళుతుంది? హిందీ భాషకు వ్యతిరేకంగా తమిళనాడు గతంలోనూ పలుమార్లు ప్రతిఘటించింది. భాషపై కేంద్రం, తమిళనాడు మధ్య వైషమ్యం ఎంతవరకు వెళ్తుందో చూడాలి. ప్రస్తుతం ఈ వివాదం రాజకీయంగా మరింత వేడెక్కుతున్నట్లు కనిపిస్తోంది. భవిష్యత్తులో కేంద్రం తన నిర్ణయాన్ని మారుస్తుందా, లేక తమిళనాడు తన వైఖరిని మరింత గట్టిగా నిలబెట్టుకుంటుందా అనేది ఆసక్తికరంగా మారింది.

## మెగా మే మంత్

మత్స్యకార భరోసా. ఏటా మే నెలలో మత్స్యకారులకు వేట నిషేధం విధిస్తారు. ఆ సమయంలో చేపలు గుడ్లు పెడుతుంటాయి. అందువల్ల సముద్రంలో వేటను ప్రభుత్వం నిషేధించింది. ఈ కాలంలో మత్స్యకారుల కుటుంబ ఖర్చుల కోసం ఏటా రూ.10 వేలు చెల్లించేది. ఈ మొత్తాన్ని కూడా మే నెలలోనే వేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. దీంతో మూడు కీలక పథకాలను ఒకే నెలలో అమలు చేయనుండటం ఆసక్తికరంగా మారింది. చంద్రబాబు ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నుంచి రాష్ట్రంలో రోడ్లు బాగుచేయడంతోపాటు మౌలిక వసతుల కల్పనకే ఎక్కువ ప్రాధాన్యమిచ్చారు. ఈ 9 నెలల్లో ఉచిత గ్యాస్ సిలిండర్ల పథకాన్ని మాత్రమే అమలు చేశారు. ఇప్పుడు కీలకమైన మూడు పథకాలకు ముహూర్తం ఫిక్స్ చేయడం, బడ్జెట్ లోనూ ఈ మేరకు నిధులు విడుదల చేసే అవకాశాలు ఉన్నాయంటున్నారు. ఒకవైపు పెట్టుబడులు ఆకర్షిస్తున్న ప్రభుత్వం.. మరోవైపు సంక్షేమానికి సిద్ధమవడంతో ఇన్నాళ్లు ఎదుర్కొంటున్న విమర్శలకు చరమగీతం పాడాలని నిర్ణయించుకున్నట్లు కనిపిస్తోందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

## ఓటెత్తిన ఉత్తరాంధ్ర

8 గంటలకు ప్రారంభమైన పోలింగ్ 4 గంటల వరకు జరగనుంది. అయితే.. ఇక్కడ మధ్యాహ్నం 2 గంటల సమయానికే 86 శాతం మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ మేరకు రాష్ట్ర ఎన్నికల అధికారులు ప్రకటన చేశారు. ఉత్తరాంధ్ర ఎమ్మెల్సీ ఎన్నికల్లో ముగ్గురు కీలక వ్యక్తుల మధ్య పోటీ తీవ్రంగా ఉంది. వీరిలో పాకాలపాటి రఘువర్మ ఏపీటీఎఫ్(ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్) తరఫున పోటీలో ఉన్నారు. అలానే.. మాజీ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులనాయుడు పీఆర్ టీయూ తరఫున పోటీ చేస్తున్నారు. మరో ముఖ్య నాయకుడు కోరెడ్ల విజయగౌరి యూటీఎఫ్ నుంచి బరిలో ఉన్నారు. మరో ఏడుగురు స్వంతంత్రులుగా కూడా పోటీ చేస్తున్నా.. ప్రధాన పోటీ మాత్రం ఈ ముగ్గురి మధ్యే కొనసాగుతోంది. ఇక, ఏపీటీఎఫ్ నుంచి బరిలో ఉన్న పాకాలపాటి రఘువర్మకు కూటమి పార్టీల్లో టీడీపీ, జనసేన మద్దతు ఇస్తున్నాయి. మరోవైపు.. ఇదే కూటమికి చెందిన బీజేపీ.. పీఆర్ టీయూ నుంచి బరిలో ఉన్న గాదె శ్రీనివాసుల నాయుడుకు మద్దతు ప్రకటించింది.(ఈ విషయంలో బీజేపీ ఏపీ చీఫ్ పురందేశ్వరి మౌనం వహించారు). అయితే.. వైసీపీ ఇక్కడ ఎవరికీ మద్దతు ప్రకటించలేదు. ఇదిలావుంటే పోలింగ్ విషయానికి వస్తే.. టీడీపీకి చెందిన రాష్ట్ర మంత్రులు, కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు సహా.. ఇతర నాయకులు ఉత్తరాంధ్రలోనే తిష్ఠ వేశారు. కూటమి అభ్యర్థిగా ఉన్న రఘువర్మను గెలిపించాలని వారు విస్తృతంగా ప్రచారం చేశారు. దీంతో భారీ ఎత్తున ఓటింగ్ జరుగుతోంది. ఇతర రెండు గ్రాడ్యుయేట్ స్థానాలతో పోల్చుకుంటే.. ఉత్తరాంధ్రలో మధ్యాహ్నం 2 గంటలకే 86 శాతం పోలింగ్ నమోదు కావడంతో కూటమి నాయకులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల పోలింగ్ సమయం ముగిసే నాటికి 14 శాతం కూడా పూర్తి అవుతుందన్న ఆశాభావంతో ఉన్నారు.

## పిఠాపురంలో రగడ!

ఓటింగ్ ప్రక్రియ ప్రారంభమైంది. ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లా, ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల పట్టభద్ర స్థానాలకు పోలింగ్ ప్రక్రియ ప్రశాంతంగా సాగుతోంది. ఎక్కడా వివాదాలు లేవు. అయితే.. ఓటింగ్ శాతం మాత్రం భారీగా పడిపోయింది. దీంతో ఓటర్లను బూతులకు తీసుకువచ్చేందుకు పోటీలో ఉన్న అభ్యర్థులు తమ తమ ప్రయత్నాలు చేస్తున్నారు. ఇదే పిఠాపురంలో వివాదంగా మారింది. పిఠాపురం నియోజకవర్గం తూర్పు గోదావరి పట్టభద్ర ఎమ్మెల్సీ అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్‌కు కీలకంగా మారింది. ఈ స్థానం నుంచి బరిలో ఉన్న స్వతంత్ర అభ్యర్థి, మాజీ ఎంపీ జీవీ హర్షకుమార్ తనయుడికి బలమైన మద్దతు లభిస్తోంది. దీంతో ఓటింగ్ శాతం పెంచేందుకు.. కూటమి పార్టీల నాయకులు ప్రయత్నాలు చేస్తున్నారు. ఫోన్ల ద్వారా సందేశాలు పంపుతున్నారు. ఇదేసమయంలో ఓటుకు నోటు కూడా ఇస్తున్నారన్నది ప్రధాన అభియోగం. ఓటేస్తే.. రూ.2500 నుంచి 4000 వరకు ఇస్తున్నారని సోషల్ మీడియాలో వీడియోలు వైరల్ అయ్యాయి. స్థానిక మునిసిపల్ కల్యాణ మండపాన్ని అడ్డాగా చేసుకుని.. ఓ కానిస్టేబుల్‌ను కాపలా పెట్టి మరీ ఇక్కడ డబ్బులు పంచుతున్నట్టు ప్రచారం రావడం.. దీనికి సంబంధించి వీడియోలు వైరల్ కావడంతో ఎన్నికల సంఘం అలెర్ట్ అయింది. వెంటనే ఉన్నతాధికారులను రంగంలోకి దింపి.. కల్యాణ మండపాన్ని సీజ్ చేయడంతోపాటు.. డబ్బులు పంచుతున్నవారిని అరెస్టు చేసినట్టు తెలిసింది.

## పాకిస్థాన్‌కు అంత స్థాయి లేదు

ఈ సందర్భంగా జమ్మూకశ్మీర్ అంశాన్ని లేవనెత్తింది. ఈ మేరకు భారత దౌత్యవేత్త పెటల్ గెహ్లాట్ పాకిస్థాన్ ను గట్టిగా నిందించారు. ఇందులో భాగంగా అంతర్జాతీయంగా నిషేధిత అతిపెద్ద ఉగ్రవాద సంస్థలకు పాకిస్థాన్ నిలయంగా మారిందని, పాకిస్థాన్ లో మైనారిటీలపై జరుగుతున్న మానవ హక్కుల ఉల్లంఘనలను ఆపాలని, భారతదేశం ఆక్రమిత ప్రాంతాలను పాకిస్థాన్ ఖాళీ చేయాలని గెహ్లాట్ కోరారు. ఈ నేపథ్యంలో తాజాగా మరోసారి ఐక్యరాజ్యసమితి మానవ హక్కుల మండలిలో స్పందించింది పాకిస్థాన్. ఈ సందర్భంగా... జమ్మూకశ్మీర్ లో ప్రజాస్వామ్యం అణిచివేతకు గురవుతోందని.. మానవ హక్కుల ఉల్లంఘటన జరుగుతోందని భారత్ పై ఆరోపణలు గుప్పించింది. ఈ ఆరోపణలపై భారత్ ఘాటుగా స్పందించింది. వివరాల్లోకి వెళ్తే... జెనీవాలో జరిగిన ఐక్యరాజ్యసమితి మానవ హక్కుల సమావేశంలో పాకిస్థాన్ న్యాయ, మానవ హక్కుల మంత్రి ఆజం నజీర్ తరార్.. జమ్మూకశ్మీర్ ని ఉద్దేశించి మాట్లాడారు. జమ్మూకశ్మీర్ లో మానవ హక్కుల ఉల్లంఘటన జరుగుతోందని ఆరోపించారు. దీనిపై స్పందించిన భారత రాయబారి క్షితిజ్ త్యాగి.. ధీటుగా స్పందించారు. ఇందులో భాగంగా... కేంద్రపాలిత ప్రాంతాలైన జమ్మూకశ్మీర్, లడ్డాఖ్ లు ఎప్పుడూ భారత్ లో అంతర్భాగమేనని.. దశాబ్దాల తరబడి పాకిస్థాన్ ఉగ్రవాదం కారణంగా దెబ్బతిన్న ఆ ప్రాంతాల్లో సాధారణ పరిస్థితులు తెచ్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని.. ప్రజస్వామ్య పురోగతి, ప్రజలకు గౌరవం కల్పించడం వంటివాటిపై భారత్ దృష్టి సారించిందని తెలిపారు. ప్రధానంగా... మానవ హక్కుల ఉల్లంఘన, మైనారిటీలను హింసించడంతో సహా ప్రజాస్వామ్య విలువలను పాటించని దేశం భారత్ కు ఉపన్యాసాలు ఇచ్చే స్థాయిలో లేదని అన్నారు. అసలు.. పలు ఉగ్రవాద సంస్థలకు ఆ దేశం ఆశ్రయం కల్పిస్తోందని.. అలాంటి దేశం తమపై ఆరోపణలు చేయడం మానాలని.. వారి ప్రజలకు సుపరిపాలనను అందించడంపై దృష్టిపెట్టాలని పేర్కొన్నారు.

## జనసేనలోకి బిగ్‌షాట్ ?

చేరుతారు అని అంటున్నారు. ఆ లిస్ట్ లో మొదటి పేరుగా ఒంగోలు జిల్లాకు చెందిన మాజీ మంత్రి సిద్ధా రాఘవరావు ఉన్నారని అంటున్నారు. సీనియర్ మోస్ట్ పొలిటీషియన్ అయిన రాఘవరావు ఒంగోలు జిల్లాలో ఒకనాడు చక్రం తిప్పారు. టీడీపీ పొలిట్ బ్యూరో మెంబర్ గా అలాగే 2014 నుంచి 2019 దాకా రవాణా శాఖ మంత్రిగా పనిచేసారు. ఆ మీదట 2019 ఎన్నికల్లో ఒంగోలు నుంచి లోక్ సభకు పోటీ చేసి ఓటమి పాలు అయ్యారు. అనంతరం ఆయన వైసీపీలో చేరారు. 2024లో దర్శి నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేయడం కోసమే ఆయన పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. అయితే దర్శిలో వైసీపీకి కీలక నేతగా జగన్ కి సన్నిహితుడు అయిన బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి ఉన్నారు. ఆయనకే జగన్ టికెట్ ఇచ్చారు. ఆయన గెలిచారు కూడా. ఈ పరిణామాల నేపథ్యంలో వైసీపీ ఓటమి తరువాత సిద్ధా రాఘవరావు చూపు కూటమి వైపు మళ్ళింది అని ప్రచారం సాగింది. విజయవాడలో గత ఏడాది వచ్చిన వరదల సందర్భంగా చంద్రబాబుని కలసి భారీ విరాళాన్ని ఆయన ఇచ్చారు దాంతో టీడీపీలో ఆయన చేరిక ఖాయమని అనుకున్నారు. కానీ ఎందుకో అలా జరగలేదు. ఇక చూస్తే కనుక సిద్ధా రాఘవరావుని జనసేనలోనికి తీసుకుని వచ్చేందుకు మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి పావులు కదిపారు. ఆయన ఇటీవలనే చక్రం తిప్పి ఒంగోలు కార్పోరేషన్ ని జనసేన పరం చేయించారు. మూకుమ్మడిగా వైసీపీ కార్పోరేటర్లు జనసేన కండువా కప్పుకున్నారు. ఇపుడు సిద్ధా రాఘవరావు వంటి బిగ్ షాట్ ని జనసేనలో చేర్పించడం ద్వారా జనసేన బలాన్ని నాలుగింతలు పెంచే ప్రయత్నం చేస్తున్నారు. ఇలా అన్నీ కలసి వస్తున్న వేళ సిద్ధా రాఘవరావు జనసేన తీర్థం పుచ్చుకోవడం ఖాయమైపోయింది. ఇక ఆయనతో పాటుగా మరింతమంది పెద్ద నాయకులు జనసేన ప్లీనరీలో పార్టీలో చేరుతారు అని అంటున్నారు. ఒకనాడు ఒంగోలు జిల్లాలో బలంగా ఉన్న వైసీపీకి ఈ పరిణామాలు ఒకింత ఇబ్బందిగా మారనున్నాయని అంటున్నారు. అయితే జగన్ కి సన్నిహిత బంధువు గా ఉన్న బాలినేని జనసేనలోకి చేరడంతో తన సత్తా చూపుతున్న క్రమంలో వైసీపీ నుంచే నాయకుల వలస మొదలైంది. మరి బాలినేని టార్గెట్లకు వైసీపీ ఎలా చెక్ చెబుతుందో చూడాల్సి ఉంది.

## జాతీయ లోక్‌అదాలత్

చేశారు.గతంలో రామచంద్రపురం నుండి ఎక్కువ సంఖ్యలో కేసులు ఇచ్చి న్యాయవాదులు సహకరించారని,అలాగే వచ్చే లోక్ అదాలత్ కార్యక్రమంలో కూడా మరిన్ని ఎక్కువ కేసులు ఇవ్వడానికి న్యాయవాదులు ముందుకు రావాలని కోరారు.రామచంద్రపురం లో అదనపు జిల్లా కోర్టు ఏర్పడి మూడు నెలలు పూర్తి అయ్యిందని,అప్పీల్ కేసులు,సివిల్ కేసులు, క్రిమినల్ కేసులు నడుస్తున్నాయన్నారు.కక్షి దారులకు ఇబ్బంది కలగకుండా సంబంధిత ఉమ్మడి జిల్లాలో ఉన్నటువంటి సీనియర్ న్యాయవాదులు, జూనియర్ న్యాయవాదులు కేసులు ఉన్నటువంటి ప్రతిఒక్కరు హాజరై వాయిదా చూసుకోవాలని ఆయన కోరారు.ఈ కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి కె.వెంకటేశ్వరరావు, జూనియర్ సివిల్ జడ్జి నిజాం శారద,అదనపు జూనియర్ సివిల్ జడ్జి వి.నాగేశ్వరరావు నాయక్, రామచంద్రపురం బార్ అసోసియేషన్ అధ్యక్షులు పిల్లి మురళీమోహన్ వెంకటరమణ, ఉపాధ్యక్షులు పలివెల సత్యనారాయణ, కార్యదర్శి వాడ్రేవు సాయి ప్రసాద్,జూనియర్ న్యాయవాదుల ప్రతినిధి పిల్లా పృధ్వి రామయ్య, మహిళా న్యాయవాదుల ప్రతినిధి కె.వి.సత్య వాణి,సీనియర్ న్యాయవాదులు అల్లం గనిరాజు,మునిని సర్వారాయుడు,వి. గోపాలరావు,మల్లిడి హరినాథ రెడ్డి,మహిళా న్యాయవాదులు పాల్గొన్నారు.

## ప్రచారాలు నిర్వహించ రాదు

భద్రతా చర్యలు బలోపేతం చే యాలని పోలీస్ సిబ్బం దిని ఆదేశించారు. ఓటింగ్ శాతం వివరా లను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు ఎటు వంటి అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా ఎన్నికల పోలిం గ్ ప్రక్రియను సమర్థవం తంగా నిర్వహించాల న్నారు ఎన్నికల నిర్వ హణ లో పోలింగ్ ప్రక్రియ అత్యంత కీలకమన్నారు రహస్య ఓటింగ్ విధానా నికి భంగం వాటిల్లకుండా నిష్పక్షపాతం పారదర్శకం ప్రశాంతంగా పోలింగ్ ను సజావుగా నిర్వహించి ప్రక్రియను విజయవంతం చేయాలని ఆదేశించారు. సూక్ష్మ పరిశీలకులు బాధ్యతగా జవాబుదారి తనంతో మొత్తం ప్రక్రియ ను నిశితంగా పరిశీలిం చాలన్నారు. విధి నిర్వ హణలో ఎటువంటి అలసత్వానికి తావు లేకుండా అప్రమత్తంగా సిబ్బంది పనిచేయాల న్నారు ఈ కార్యక్రమంలో స్థానిక తహసిల్దార్ అశోక్ కుమార్ తదితరులు పా ల్గొన్నారు

## రేవంత్ టాలెంటే వేరు

చెప్పటం.. పెండింగ్ లో ఉన్న ప్రాజెక్టులకు వెంటనే అనుమతులు మంజూరు చేయాలని కోరటం లాంటివి చేశారు. నిజానికి ఈ అంశాలతో కూడిన వివరాలు.. వార్తలు ఇప్పటికే వచ్చేశాయి. వారు చెప్పిందే మేం చెబితే అందులో అర్థమే లేదు. మరి.. మేం ఏం చెబుతున్నామంటారా? అక్కడికే వస్తున్నాం. ప్రధాని మోడీతో తెలంగాణ సీఎం భేటీ సందర్భంగా కొన్ని ఆసక్తికర అంశాలు చోటు చేసుకున్నాయి. అందులో ఒకటి గంటకు పైగా సమావేశం సాగటం. అంత టైం చాలా తక్కువ మందికి మాత్రమే ప్రధాని మోడీ ఇస్తారన్నది మర్చిపోకూడదు. మరో ఆసక్తికర అంశం ఏమంటే.. తనతో పాటు మంత్రి శ్రీధర్ బాబు.. సీఎస్ శాంతికుమారి.. సీఎం ముఖ్య కార్యదర్శి శేషాద్రి తదితరుల్ని తన వెంట పీఎంవోతో తీసుకెళ్లారు. కానీ.. ప్రధానమంత్రి నరేంద్ర మోడీతో ముఖాముఖిన గంట పాటు మాట్లాడుకోవటం.. ఈ సందర్భంగా పలు అంశాల్ని షేర్ చేసుకోవటం విశేషం. అయితే.. బయట నుంచి చూసినప్పుడు మంత్రి శ్రీధర్ బాబుతో కలిసి ప్రధాన మంత్రి మోడీకి పుష్పగుచ్ఛం ఇచ్చిన ఫోటో మాత్రం బయటకు రావటం.. విస్తృతంగా ప్రచారం కావటం చూసినప్పుడు రేవంత్ టాలెంట్ ను చూసి ముచ్చట చెందాల్సిందే. అప్పుడప్పుడు సీఎం రేవంత్ నోటి నుంచి ఒక మాట వస్తూ ఉంటుంది. ఎన్నికల వేళలోనే రాజకీయం. మిగిలిన రోజుల్లో పాలనే. సరిగ్గా ఇలాంటి మాటే ప్రధాని నరేంద్ర మోడీ నోటి నుంచి తరచూ వస్తూ ఉంటుంది. కానీ.. ఆయన ఏం చేస్తారు? ఎలా వ్యవహరిస్తారు? అన్నది అందరికి తెలిసిందే. ఇలా చెప్పే మాటలకు చేసే పనులకు సంబంధం లేకుండా చేసే రేవంత్.. తమ పార్టీకి ఏ మాత్రం పడని ప్రధానమంత్రి వద్దకు వెళ్లి.. రాష్ట్ర అవసరాలకు సంబంధించిన అంశాల్ని వివరంగా మాట్లాడటం.. అందరిని కలుపుకు వెళ్లామన్న భావనను కలిగించేలా చేయటం మాత్రం రేవంత్ టాలెంట్ కు నిదర్శనంగా చెప్పక తప్పదు. తెలంగాణ కోరిన అంశాలన్నింటినీ కచ్చితంగా పరిశీలిస్తామని.. రాష్ట్ర డెవలప్ మెంట్ కు సహకరిస్తామని ప్రధాని నరేంద్ర మోడీ హామీ ఇచ్చినట్లుగా సీఎం రేవంత్ పేర్కొనటం గమనార్హం.

## జగన్ ఫ్యూచరేంటి ?

కూడా.. వైసీపీకి ఇప్పుడు దిక్కు తోచని పరిస్థితిని కల్పిస్తోంది. సాధారణంగా కూటమి పార్టీలు పాలిస్తున్న రాష్ట్రాల్లో చికాకులు.. పెకాకులుగా మారి.. బంధాలు బలహీన పడుతున్న పరిస్థితి ఉంటుంది. కానీ, ఇలాంటి వాటిని తాము సంయుక్తంగా ఎదుర్కొంటామే తప్ప.. తాము బలహీన పడేది లేదన్నది కూటమి చెబుతున్న మాట. ఇది మరింతగా వైసీపీలో రచ్చకు దారితీస్తోంది. అంటే.. తాము ఒంటరిగానే మరోసారి పోరుకు సిద్ధం కావాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో వైసీపీ భవిష్యత్తు ఏంటి? ఎలా ముందుకు సాగాలి? జమిలి వచ్చినా.. సాధారణమే జరిగినా.. ఎప్పుడు ఎన్నికలు వచ్చినా.. వైసీపీని తీరం చేర్చేందుకు ఉన్న మార్గాలు ఏంటనేది ఇప్పుడు చర్చనీయాంశంగా మారాయి. మరీ ముఖ్యంగా అధినేత వ్యవహార శైలిని కూడా తప్పుబడుతున్న నాయకులు పెరుగుతున్నారు. "సభకు వెళ్దాం.. రాలేదన్న అపవాదు ఎందుకు? పైగా ప్రజలకు కూడా అన్నీ అర్థమవుతున్నాయి" అని మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి వ్యాఖ్యానించినట్టు పార్టీ వర్గాల మధ్యే చర్చ సాగుతోందంటే.. సభకు వెళ్లే విషయంపై ఎంతగా మథన పడుతున్నారో అర్థం అవుతుంది. ఈ నేపథ్యంలో జగన్ ముందున్న ప్రధాన కర్తవ్యాలు రెండే రెండు. ఒకటి సభకు వెళ్లడం. తద్వారా ఎదురయ్యే అన్ని అవమానాల ను ఆయన భరించడం.. తద్వారా.. ప్రజల నుంచి సానుభూతిని రాబట్టుకోవడం. వచ్చే నాలుగేళ్లలో సభలో తమ గురించి అవమానాలు ఎదుర్కొన్నారన్న సంకేతాలు పంపించడం ద్వారా.. గతంలో ఓదార్పు యాత్రలద్వారా లభించిన సానుభూతిని తిరిగి జగన్ పొందేందుకు అవకాశం ఉంటుంది. అదేవిధంగా రెండో అంశం ప్రజల మధ్యకు వెళ్లడం. ప్రజల సమస్యలను ప్రస్తావించడం.. తెలుసుకోవడం ద్వారా.. వాటిని ఎక్కువగా ప్రచారంలోకివచ్చేలా చేయడం. ఈ రెండు మాత్రమే వైసీపీకి జవజీవాలు అందిస్తాయని పరిశీలకులు అంటున్నారు .

విశ్వం వాయిస్
అవినీతిపై- అక్షరసమరం...



కాకినాడ తూర్పు గోదావరి
డా బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ
శుక్రవారం
ఫిబ్రవరి/28/2025



www.viswam voice.com

# ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు వేసిన నగర ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు

**- ఓటు హక్కును అందరూ వినియోగించుకోవాలి - రాష్ట్ర శ్రేయస్సుకు పని చేస్తున్న కూటమి ప్రభుత్వానికి మద్దతు ఇవ్వాలి**
**- ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్**



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్:** పట్టభద్రులంతా వివేకంతో, విజ్ఞతతో ఆలోచించి పట్టభద్రుల శాసనమండలి ఎన్నికల్లో కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరానికి ఓటు వేస్తున్నారని రాజమండ్రి సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ (వాసు) చెప్పారు. గురువారం ఉదయం ట్రైనింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన మండలి ఎన్నికల పోలింగ్ బూత్ లో ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు ఓటు వేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ రాష్ట్ర శ్రేయస్సు కోసం పాటుపడుతున్న ఎన్డీయే కూటమిని బలపరి చేందుకు కూటమి అభ్యర్థిని గెలిపించు కోవాలసిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. రాష్ట్రాభివృద్ధికి పాటుపడుతున్న కూటమి ప్రభుత్వానికి మద్దతు ఇవ్వడం అందరి బాధ్యత అన్నారు. ఇప్పటికే అనేక మంది పట్టభద్రులు ఓటు వేయడానికి వస్తున్నామని,ఇది తమ బాధ్యత అని ఫోన్లు చేసి చెబుతున్నారని, ఇది మంచి పరిణామమని హర్షం వ్యక్తంచేశారు. పోటీలో ఉన్న ఇతర అభ్యర్థులను తక్కవ చేయడమో, కించపరచడమో తమ ఉద్దేశం కాదని, ప్రజాస్వామ్యంలో ఎవరైనా పోటీ చేయవచ్చని, అయితే ప్రస్తుతం నష్టాలు, కష్టాల్లో ఉన్న రాష్ట్రాన్ని అభివృద్ధి వైపు తీసుకు వెళుతున్న కూటమి ప్రభుత్వాన్ని బలపరచడం అందరికి అవసరమని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ వ్యాఖ్యానించారు. అందుకే తన ఓటును సద్వినియోగం చేసుకున్నానని అన్నారు. అలాగే పట్టభద్రులంతా మండలి ఎన్నికల్లో కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరానికి మొదటి ప్రాధాన్యత ఓటువేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఎందుకంటే గత ఐదేళ్ళుగా రాష్ట్ర రాజధాని ఏదంటే చెప్పలేని పరిస్థితని, ఇప్పుడు రాజధాని అమరావతికి కేంద్రం నుండి రూ.15 వేల కోట్లు తెచ్చుకున్నామన్నారు. గతంలో వైజాగ్ స్టీలు ప్లాంటు పరిస్థితి ఏమిటో అందరికీ తెలుసని, ఇప్పుడు స్టీల్



ప్లాంటుకు కేంద్రం నుంచి ఆర్థిక సహకారం తీసుకుంటున్నామని తెలిపారు. మెగా డీఎస్సీ ద్వారా జూన్ లో అందరికీ ఉద్యోగాలు,




పోస్టింగులు ఇచ్చేందుకు కూడా మంత్రి నారా లోకేష్ చర్యలు తీసుకుంటున్నారని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ చెప్పారు. అన్ని రంగాల్లో కూడా రాష్ట్రాన్ని ముందుకు తీసుకు వెళుతున్నామన్నారు. ఇది పట్టభద్రుల ఎన్నిక.... అందుకే విద్యావంతులు విజ్ఞతతో, వివేకంతో ఆలోచించి రాష్ట్రానికి గత ఐదేళ్ళలో పట్టిన నష్టాన్ని, కష్టాన్ని అధిగమించి రాష్ట్రాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తున్న ఎన్డీయే కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరానికి ఓటువేసి గెలిపించాలని కోరారు. ఇది అందరి బాధ్యత, అవసరమన్నారు. అందుకే పట్టభద్రులు పేరాబత్తులకు ఓటు వేయడం తమ బాధ్యత అని చెబుతూ ఓటు వేయడానికి వస్తున్నారని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ సంతోషం వ్యక్తం చేశారు. అనంతరం ఆయన నగరంలో వివిధ ప్రాంతాల్లో గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలు జరుగుతున్న 22 పోలింగ్ స్టేషన్లను సందర్శించి పోలింగ్ జరుగుతున్న విధానాన్ని పరిశీలించారు.

**ముస్లింల మనోభావాలు దెబ్బ తినేలా చిత్రాలను చిత్రీకరిస్తే**

## చట్టపరమైన పోరాటాలు తప్పవు



**రావులపాలెం, విశ్వం వాయిస్ న్యూస్:** ఈ మధ్యకాలంలో అటు హిందీ మరియు తెలుగు చలన చిత్రాలలో ముస్లింల చరిత్ర ను వక్రీకరిస్తురీ ముస్లింలను దేశ ద్రోహులుగా టెర్రరిస్టులుగా సినిమాలు తీస్తున్నారని సినిమాలను చూస్తున్న చదువు లేని వారు దాన్నే నిజమని నమ్మి సామాన్య ముస్లిం ల పై దాడులు మరియు అవమాన పరిచే విధంగా సోషల్ మీడియాలో మాట్లాడుతున్నారని దీని వల్ల దేశ మత సామరస్యం దెబ్బతింటుందని ఇటువంటి చిత్రాలు చిత్రికరిస్తే ఆ చిత్ర దర్శక నిర్మాతలు పై కచ్చితంగా కేసులు వేసి న్యాయ పోరాటాలు చేస్తామని ఇటువంటి చిత్రాలు సమాజానికి హాని కలిగిస్తున్నాయని అసోసియేషన్ ఫర్ ప్రొటెక్షన్ ఆఫ్ సివిల్ రైట్స్ రాష్ట్ర కో ఆర్డినేటర్ షేక్ అన్సారీ మీడియా సమావేశం లో తెలిపారు.

**ఇంజనీరింగ్, వృత్తివిద్య కోర్సుల్లో**

## ప్రవేశాలకు సవరణలు

**తెలంగాణ :** తెలంగాణ ప్రభుత్వం ఇంజినీరింగ్, వృత్తివిద్య కోర్సుల్లో ప్రవేశాల విషయంలో సవరణలు చేసింది. ఇంజనీరింగ్, వృత్తి విద్యలో 85 శాతం సీట్లు స్థానిక విద్యార్థులకే కేటాయించాలని నిర్ణయించింది. 15 శాతం అన్ రిజర్వ్‌డ్ కోటా సీట్ల కేటాయింపులో కొన్ని మార్పులు చేసింది. 15 శాతం సీట్లకు 4 రకాల వారు అర్హులుగా గుర్తిస్తూ మార్గదర్శకాలు విడుదల చేసింది. ఈ కోటాలో తెలంగాణ స్థానికులతో పాటు ఇతర రాష్ట్రాల్లో చదువుకున్న వారు కూడా అర్హులని పేర్కొంది. అయితే ఇతర రాష్ట్రాల్లో చదివిన వారు తెలంగాణలో కూడా పదేళ్లు చదివి ఉండాలని నిబంధన విధించింది. అంతేగాక, 15 శాతం సీట్లకు తెలంగాణతో ఏపీ విద్యార్థులు పోటీ పడే అవకాశాన్ని తొలగించింది.

**చిన్నకొండేపూడి గ్రామంలో**

## కోళ్ల ఫారం దుర్వాసనతో స్థానికుల ఆందోళన



**సీతానగరం, విశ్వం వాయిస్ న్యూస్:** సీతానగరం మండలం చిన్నకొండేపూడి గ్రామం శ్రీరామ పుత్రయ కోళ్ల ఫారం నుంచి వచ్చే దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నామని చిన్న కొండేపూడి గ్రామ దళితవాడ ప్రజలు ఆరోపిస్తున్నారు. కోళ్ల ఫారంతో వచ్చే దుర్గంధంతో సమీప వ్యవసాయ రైతులు,బాటసారులు,సమీప గ్రామ ప్రజలు పలు రకాల విష జ్వరాలు బారిన పడుతున్నామని, జనావాసాలకు సమీపంలో కోళ్ల ఫాంలు కారణంగా దుర్వాసనతో స్థానిక ప్రజలు పలు రోగాల బారిన పడక తప్పడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇంత జరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు బలంగానే వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ స్పందించి విచారణ జరిపి స్థానిక ప్రజల ఆరోగ్య భద్రతపై చర్యలు చేపట్టే విధంగా నివేదిక అందించాలని స్థానికులు కోరుతున్నారు. ఎన్నిసార్లు ఫిర్యాదులు చేసినా గ్రామపంచాయతీ అధికారులు కనీసం నోటీసులు కూడా జారీ చేయడం లేదని దళితవాడ అంబేద్కర్ యూత్ ఆరోపిస్తున్నారు. అనునిత్యం వెదజల్లే దుర్వాసనను కట్టడి చేయాలని శ్రీరామ పుత్రయ్యను అడిగిన మాపై బెదిరింపులకు గురి చేస్తున్నారని పలువురు అంటున్నారు. కుక్కలు, కొంగలు,కాకులు కోళ్ల వ్యర్థాలను సమీప ప్రాంత పంటపొలాల్లోకి, దళితవాడకు తీసుకొచ్చి పడవేయడంతో విషజ్వరాలు, పలు రకాల వైరస్ వ్యాధులు తరచుగా మాకు వస్తున్నాయని దళితవాడ మహిళలు ఆరోపిస్తున్నారు. దాంతో అప్పులు చేసి ఆసుపత్రుల చుట్టూ



తిరుగుతున్నామని వారు తెలియజేస్తున్నారు. ఈ కోళ్ల ఫారంకు గ్రామ పంచాయతీ తీర్మానం, సంబంధిత అనుమతులు లేవని స్థానికులు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వ నిబంధనలను అతిక్రమించి నడుపుతున్న నిర్వాహకులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని చిన్న కొండేపూడి గ్రామ వాసులు కోరుతున్నారు.

## 27 సంవత్సరాల తరువాత శని నక్షత్ర మార్పు..



జ్యోతిషశాస్త్రం ప్రకారం, శని దేవుడిని కర్మ ఫలితాలను ఇచ్చే గ్రహంగా భావిస్తారు. అందుకే జ్యోతిష్య శాస్త్రంలో శని గ్రహానికి సంబంధించిన మార్పులు చాలా ముఖ్యమైనవిగా పరిగణించబడతాయి. అయితే శనిదేవుడు ఒక నిర్దిష్ట కాలం తరువాత తన రాశిని మార్చుకుంటాడు. ఈ ప్రభావం అన్ని రాశుల వారిపై పడుతుంది. మార్చి 02, 2025న, శని పూర్ణిమ నక్షత్రంలోని మూడవ పాదంలోకి ప్రవేశిస్తాడు. ఇది అన్ని రాశిచక్ర గుర్తుల జీవితాల్లో ఏదో ఒక రకమైన మార్పును తెస్తుంది. 27 సంవత్సరాల తర్వాత శని పూర్ణిమ నక్షత్రానికి తిరిగి రావడం కొన్ని రాశుల వారి అదృష్టాన్ని తీసుకురానుంది. ఈ పోస్టులో, శని సంచారం వలన ఏ రాశుల వారికి అదృష్టం కలిసి వస్తుందో తెలుసుకుందాం. శని దేవుడు పూర్ణిమ నక్షత్రంలో సంచారం వలన కర్కాటక రాశి వారు ఎంతో ప్రయోజనం పొందుతారు. ఈ శని సంచారం ఈ రాశి వారి ఆత్మవిశ్వాసాన్ని పెంచుతుంది. ఈ రాశి వారికి పూర్తి స్థాయి అధికారం లభిస్తుంది. దీని కారణంగా ఈ వీరు పెండింగ్‌లో ఉన్న తమ పనులన్నిటినీ పూర్తి చేసుకోగలుగుతారు. ఉద్యోగ జీవితంలో కొత్త అవకాశాలు లభిస్తాయి. తమ కెరీర్‌లో పురోగతి సాధించగలుగుతారు. కుటుంబ జీవితంలో ఆనందం నెలకొంటుంది. తమ జీవిత భాగస్వామితో నాణ్యమైన సమయాన్ని గడపగలుగుతారు. మీరు పనిలో బాధ్యతాయుతంగా వ్యవహరిస్తే, మీ విజయావకాశాలు పెరుగుతాయి. మీ కృషి, ప్రయత్నాలకు ప్రశంసలు అందుకుంటారు. ఈ కాలంలో కర్కాటక రాశి వారి ఆరోగ్యం అద్భుతంగా ఉంటుంది.కన్య రాశి వారికి శని నక్షత్ర మార్పు శుభ ఫలితాలను ఇస్తుంది. ఇది వారి జీవితాల్లో అనేక మంచి మార్పులను తెస్తుంది. ఈ సమయంలో వారి ప్రసంగం సౌమ్యతతో నిండి ఉంటుంది. వారు వారి వృత్తి జీవితంలో ఊహించని కీర్తిని పొందుతారు. ఉద్యోగ జీవితానికి సంబంధించి, పదోన్నతులు, అధిక ఆదాయం పొందే అవకాశం ఉంది. ఈ రాశికి చెందిన వారు విదేశాలకు వెళ్లి తమ కెరీర్ లక్ష్యాలను సాధించగలరు. కానీ, మీరు మీ ఆరోగ్యం పట్ల కొంత శ్రద్ధ వహించి అనవసరమైన ఖర్చులను నివారించాలి. అలాగే వీరు వివిధ ఒప్పందాల నుండి భారీ లాభాలను పొందవచ్చు. పూర్ణిమ నక్షత్రంలో శని సంచారం మీన రాశి వారికి మంచి ఫలితాలను తెస్తుంది. పనిలో వారి ప్రయత్నాలకు వారు ప్రశంసలు పొందుతారు. సమాజంలో వారి కీర్తి మరియు గౌరవం పెరుగుతాయి. వారి ప్రయత్నాలు సానుకూల ఫలితాలను ఇస్తాయి. రాజకీయాలు, ప్రభుత్వ రంగాలతో సంబంధం ఉన్న వ్యక్తులు ఎక్కువ లాభాలను ఆర్జించవచ్చు. వ్యాపారవేత్తలు వివిధ ఒప్పందాల నుండి ఊహించని లాభాలను పొందవచ్చు. వ్యాపారాన్ని విస్తరించే అవకాశాలు కూడా ఉన్నాయి. విద్యార్థులు తమ విద్యా జీవితంలో విజయం సాధిస్తారు. వారి ఆత్మవిశ్వాసం పెరుగుతుంది.

**మనిషి మరణాన్ని జయించాలంటే**

## ఏం చేయాలో చెప్పిన శాస్త్రవేత్త.. 120 సంవత్సరాలు గ్యారెంటీ!



ప్రతి మనిషి ఎదో ఒక రోజు చనిపోతాడన్న విషయం తెలిసిందే. సమయం సందర్భం వచ్చినప్పుడు ప్రతి ఒక్కరూ కాల గర్భంలో కలిసిపోవాల్సిందే. అయితే మనిషి ఎలా చనిపోతున్నారు? మనిషి మరణాన్ని ఎదురించలేడా అనే విషయాలపై శాస్త్రవేత్తలు పరిశోధనలు జరుపుతున్నా రహస్యం మాత్రం ఇప్పటి వరకు వీడలేదు. అయితే ఈ విషయంపై నోబెల్ బహుమతి గ్రహీత మరియు రాయల్ సొసైటీ మాజీ అధ్యక్షుడు వెంకీ రామకృష్ణన్.. 'ది సైన్స్ ఆఫ్ ఏజింగ్' సెషన్‌లో ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఆ వ్యాఖ్యలు ఏంటి? మనిషి మరణాన్ని ఓడించగలడా అనే విషయాలను ఈ స్టోరీలో తెలుసుకుందాం. ఇప్పటి వరకు మనిషి చనిపోవడం లేదా వృద్ధాప్యాన్ని ఎదుర్కొనే అంశంపై అనేక పరిశోధనలు జరగుతున్నాయి. మనుషుల జీవితకాలం సాధారణంగా 110-112 ఏళ్ల మధ్య ఉంటుందని, కొన్నేళ్లుగా శతాధిక వయస్సు గల వ్యక్తుల సంఖ్య కూడా పెరుగుతోంది అని రామకృష్ణన్ చెప్పారు. శతాధిక వయస్సు అంటే 100 ఏళ్లు లేదా అంతకంటే ఎక్కువ కాలం జీవించడం. ప్రస్తుతం, లక్షల మంది 80 ఏళ్ల వయస్సు చేరుకుని ఉన్నారని, వారిలో చాలా మంది మరింత కాలం జీవించే అవకాశం ఉందన్నారు. 110 ఏళ్లకు మించి జీవించే వ్యక్తుల సంఖ్య పెరుగడం లేదని, ఇది శాస్త్రవేత్తలకు ఒక సవాలుగా మారిందని, జీవశాస్త్రంలో ఇది సహజ ప్రక్రియ అని రామకృష్ణన్ చెప్పారు. అయితే, ఆరోగ్యంగా వృద్ధాప్యాన్ని జయించడానికి కొన్ని మార్గాలను అనుసరించాలని కూడా సూచించారు. ప్రస్తుతం, జెనెటిక్ మార్పులు.. మనుషుల జీవనశైలి, వృద్ధాప్యంపై ప్రభావం చూపిస్తున్నాయన్నారు. గడిచిన దశాబ్దంలో వృద్ధాప్యంపై 3 లక్షలపైగా పరిశోధన పత్రాలు వెలువడగా, యాంటీ ఏజింగ్ పరిశోధనల కోసం 700 పైగా సంస్థలు భారీ పెట్టుబడులు పెట్టినట్లు ఆయన తెలిపారు. అయితే, శాస్త్రపరిశోధనల కంటే ఆరోగ్యకరమైన జీవనశైలి పాటించడం ఎక్కువ ప్రభావం చూపిస్తుందని, కొన్ని చిట్కాలను పంచుకున్నారు. ప్రతి వ్యక్తీ స్నేహితులను కలిగి ఉండాలని, ఇతరులతో కలసి, బంధాలతో జీవించాలన్నారు. ఒంటరిగా ఉండడం, ఒంటరిగా ఫీలవడం వలన వారి ఆయుస్సు తగ్గిపోతుందని పేర్కొన్నారు. ఏదో ఒక లక్ష్యం ఉంచుకుని దాన్ని సాధించడానికి కృషి చేసే వారు, నిర్లక్ష్యంగా ఉన్న వారి కంటే ఎక్కువ కాలం జీవిస్తారని ఆయన చెప్పారు. ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవడం, పూర్తి నిద్రపోవడం, ప్రతిరోజూ వ్యాయామం చేయడం వంటి వాటివల్ల ఎక్కువకాలం జీవించగలుగుతామని పేర్కొన్నారు.

**ఇడ్లీలో క్యాన్సర్ కారకాలు..**

## ఆరోగ్య శాఖ నివేదికలో విస్తుపోయే నిజాలు వెలుగులోకి.!



ఇడ్లీ... పేరు వింటేనే నోరూరించే ఆహారం. దక్షిణ భారతదేశంలో ఇది ఒక ముఖ్యమైన ఆహారం మాత్రమే కాదు, ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మందికి ఇష్టమైన అల్పాహారం కూడా. పేద, ధనిక అనే తేడా లేకుండా, చిన్న పిల్లల నుండి వృద్ధుల వరకు అందరూ ఇడ్లీని సాంబార్‌తో కలిపి తినడానికి ఇష్టపడతారు. ఆరోగ్యకరమైన కార్బోహైడ్రేట్లు మరియు ప్రోటీన్‌ను అందించే ఈ ఆహారం సులభంగా జీర్ణమవుతుంది. అంతేకాదు, ఇడ్లీని తయారు చేయడానికి నూనె లేదా ఎక్కువ మసాలాలు కూడా అవసరం లేదు. అందుకే చాలామంది ఆరోగ్యకరమైన అల్పాహారంగా ఇడ్లీని ఎంచుకుంటారు. కానీ, బెంగళూరు నగరంలో వెలుగులోకి వచ్చిన ఒక సంచలన విషయం ఇడ్లీ ప్రియులను షాక్‌కు గురిచేసింది. బెంగళూరులోని ఆరోగ్య శాఖ అధికారులు జరిపిన అధ్యయనంలో కొన్ని రెస్టారెంట్లు , వీధి వ్యాపారులు ఇడ్లీలను తయారుచేసే విధానం క్యాన్సర్‌కు కారణమయ్యే ప్రమాదం ఉందని తేలింది. ఈ వార్త ఇడ్లీ ప్రియులను తీవ్ర దిగ్భ్రాంతిని గురిచేస్తుంది.. బెంగళూరు ఆరోగ్య శాఖ అధికారులు నగరంలోని హొటళ్లు ,వీధి వ్యాపారులు ఇడ్లీలను ఎలా తయారుచేస్తున్నారో తెలుసుకోవడానికి ఒక ప్రత్యేక అధ్యయనం నిర్వహించారు. దీనిలో భాగంగా, నగరంలోని వివిధ ప్రాంతాల నుండి ఇడ్లీ నమూనాలను సేకరించి ప్రయోగశాలలో పరీక్షించారు. ఈ పరీక్షల్లో విస్తృతపోయే విషయాలు విషయాలు వెలుగులోకి వచ్చాయి. అనేక ఇడ్లీ నమూనాలలో క్యాన్సర్ కారక రసాయనాలు ఉన్నాయని అధికారులు గుర్తించారు. దాదాపు 500 ఇడ్లీ నమూనాలను పరీక్షించిన ఆరోగ్య శాఖ, వాటిలో 35 నమూనాలలో క్యాన్సర్ కారక రసాయనాలు ఉన్నాయని నిర్ధారించింది. ఈ రసాయనాలు వినియోగదారులలో క్యాన్సర్ వచ్చే ప్రమాదాన్ని పెంచుతాయని అధికారులు హెచ్చరిస్తున్నారు. ఇంకా వందలాది నమూనాల పరీక్ష ఫలితాలు రావాల్సి ఉంది. ఈ ఫలితాలు ఇప్పుడు అందరిని ఆందోళన కలిగిస్తుంది. క్యాన్సర్ కారకాలకు కారణం ఏమిటి?: కలుషితమైన ఇడ్లీ నమూనాలను గుర్తించిన తరువాత, ఆరోగ్య శాఖ అధికారులు ఆ ఇడ్లీలను తయారుచేసిన హొటళ్లు , వ్యాపారులను సందర్శించి వారి తయారీ విధానాలను నిశితంగా పరిశీలించారు. సాధారణంగా సంప్రదాయ పద్ధతిలో, ఇడ్లీ పిండిని శుభ్రమైన కాటన్ వస్త్రాలపై వేసి, ఆపై ఇడ్లీ ట్రేలపై పెట్టి ఆవిరిలో ఉడికిస్తారు. కానీ, చాలా హొటళ్లు , వీధి వ్యాపారులు ఇప్పుడు కాటన్ వస్త్రాలకు బదులుగా ప్లాస్టిక్ షీట్లను ఉపయోగిస్తున్నారు. ఆరోగ్య నిపుణులు చెబుతున్న ప్రకారం, అధిక వేడికి ప్లాస్టిక్ గురైనప్పుడు రసాయనాలను విడుదల చేస్తుంది. ఈ రసాయనాలలో కొన్ని క్యాన్సర్ కారకాలుగా మారే అవకాశం ఉంది.



అల్లవరంలో ప్రశాంతంగా

## ముగిసిన ఎమ్మెల్సీ ఎన్నికలు

- అధిక సంఖ్యలో ఓటు హక్కును వినియోగించుకున్న పట్టభద్రులు

**అల్లవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** అంబేద్కర్ కోనసీమ జిల్లా అల్లవరం మండలం అల్లవరం జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలలో శాసనమండలి ఎన్నికల పోలింగ్ గురువారం ఉదయం 8 గంటల నుండి ప్రారంభం అయ్యింది .మండలంలోని పట్టభద్రుల ఓటర్లు సాయంత్రం 4 గంటలు వరకు అధికశంఖ్యలో పాల్గొని తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఎటువంట అవాంచనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంత వాతావరణంలో అధికారులు ఎన్నికలు నిర్వహించారు.



అత్యధిక కుంభమేళా బస్సులను పంపిన

## ఆర్.టీ.సీ.జిల్లా ప్రజా రవాణాధికారికి సన్మానం

**అమలాపురం టౌన్, విశ్వం వాయిస్ న్యూస్ :** మహా కుంభమేళా యాత్రకు కోనసీమ జిల్లా నుండి రాష్ట్ర వ్యాప్తంగా అత్యధికంగా 26 బస్సుల ను నడపటం జరిగినది. ఈ బస్సులను నడపటానికి కీలక పాత్ర పోషించి సహాయ సహకారాలు అందించిన కోనసీమ జిల్ల ప్రజా రవాణాధికారి ఎమ్.శ్రీనివాసరావ్‌ను గురువారం అమలాపురం డిపోలో డిపో మేనేజర్ సి.హెచ్ ఎస్.ఎన్.మూర్తి ఆధ్వర్యంలో డిపో సిబ్బంది ఘనంగా సత్కరించారు. అమలాపురం డిపో నుండి కుంభమేళా యాత్రకు స్పెషల్ బస్సులను ఆపరేట్ చేయుటకు కృషి చేసిన ఓ.పి.ఆర్.యస్ కౌంటర్ సిబ్బందిని, జి.అర్.ఎల్ దేవి గ్యారేజ్ ఇంచార్జ్, ప్రతిమా కుమారి ట్రాఫిక్ ఇంచార్జ్, నాగరాజు బుకింగ్ సూపర్వైసర్, వరహాలబాబు ఓ.పి.ఆర్.యస్ సూపర్వైసర్ కు బహుమతులిచ్చి అభినందించారు.





శుక్రవారం 28/ ఫిబ్రవరి/2025
www.viswamvoice.com

డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా ఎడిషన్

విశ్వంవాయిస్
అవినీతిపై- అక్షరసమరం...
తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY

గ్రాడ్యుయేట్ ఓటు వినియోగించుకున్న

## వైసీపీ నాయకులు



**రామచంద్రపురం నియోజకవర్గం, విశ్వం వాయిస్ న్యూస్ :** ఉమ్మడి తూర్పు పశ్చిమగోదావరి జిల్లాల గ్రాడ్యుయేట్ ఓటర్ల ఎన్నికకు సంబంధించి పోలింగ్ గురువారం ప్రశాంతంగా ముగిసింది. రామచంద్రపురం స్థానిక శ్రీ కృతివెంటి పెర్రాజు పంతులు కళాశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్ లో గ్రాడ్యుయేట్ ఓటు హక్కు వినుయోగించుకున్న రాజ్యసభ సభ్యులు పిల్లి సుభాష్ చంద్రబోస్ మరియు అయన తనయుడు సూర్యప్రకాష్.అలానే మున్సిపల్ చైర్ పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి,పార్టీ కన్వీనర్ గాదంశెట్టి శ్రీధర్,పార్టీ చీఫ్ విప్ సాయి ప్రసాద్ వాడ్రేవు కూడా గ్రాడ్యుయేట్ ఓటు హాక్క వినియోగించడం జరిగింది.ఈ సందర్భంగా ఇరువురు మాట్లాడుతూ ప్రశాంతమైన వాతావరణంలో ఎన్నికలు జరగడం చాలా సంతోషకరమైన విషయం అని,అందుకు సహకరించిన అధికారులుకు, పోలింగ్ సిబ్బందికి మరియు పోలీస్, రెవిన్యూ అధికారులుకు అభినందనలు తెలిపారు.



## ఘనంగా భీమేశ్వరుని రథోత్సవం



**సామర్లకోట, విశ్వం వాయిస్ న్యూస్:** మహా శివరాత్రి ఉత్సవాల్లో భాగంగా శ్రీ కుమార రామ భీమేశ్వర స్వామి రథోత్సవం గురువారం సాయంత్రం అత్యంత వైభవంగా జరిగింది. తొలుత ఆలయంలో భీమేశ్వర స్వామి బాలా త్రిపుర సుందరి అమ్మవారి ఉత్సవ మూర్తులను ప్రత్యేక పూజలు జరిపి పల్లకిలో గాంధీ బొమ్మ సెంటర్లోని అలంకరించిన రథం వద్దకు తరలించారు. అనంతరం భీమేశ్వర స్వామి, బాలా త్రిపుర సుందరి అమ్మవార్లు ప్రత్యేకంగా అలంకరించబడిన రథంపై ఆసీనులై పురవీధుల్లో ప్రజల మధ్యకు తరలిరాగా ప్రజల అత్యంత భక్తిశ్రద్ధలతో స్వామివారిని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేపట్టారు. స్థానిక గాంధీ బొమ్మ సెంటర్లో రథోత్సవాన్ని పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప, కూడా చైర్మన్ తుమ్మల రామస్వామి (బాబు), రుడా చైర్మన్ బొడ్డు అనంత వెంకటరమణ చౌదరి లు కొబ్బరికాయలు కొట్టి రథోత్సవాన్ని ప్రారంభించారు. రథోత్సవం బళ్ల మార్కెట్ సెంటర్, గొల్లగూడెం రోడ్డు, నీలమ్మ చెరువు, గోలి వారి వీధి మీదుగా స్టేషన్ సెంటర్కు అర్ధరాత్రికి చేరుకుంది. ప్రజలు రథాన్ని లాగుతూ స్వామివారిని దర్శించుకుంటూ తరించారు. ఆలయ కార్య నిర్వహణ అధికారి బళ్ల నీలకంఠం, ఉత్సవ ప్రత్యేక అధికారి టి సూర్యనారాయణ పర్యవేక్షణలో రథోత్సవానికి అన్ని ఏర్పాట్లు చేపట్టారు.

**ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు :**

రథోత్సవ కమిటీ ఆధ్వర్యంలో 16 రకాల సాంస్కృతిక కార్యక్రమాలను రథోత్సవంలో ఏర్పాటు చేయగా అవి ప్రజలను ఎంతగానో ఆకట్టుకున్నాయి. చెల్లూరు కు చెందిన గారడి, సామర్లకోటకు చెందిన మహేశ్వరి మ్యూజికల్ బ్యాండ్, సామర్లకోట కు చెందిన పులి వేషాలు, కాకినాడ జగన్నాధపురం కు చెందిన కాళికాదేవి వేషం, అంగరకు చెందిన తాంబూల మేళం, జగన్నాధపురం కు చెందిన నాగ అఘోరి నృత్యం, అంగరకు చెందిన కేరళ రెక్కల డాన్స్, ఏలూరు కు చెందిన డాల్స్, హనుమాన్, చైనా కోబ్రా, లక్క గుర్రాలు, దాండియా వంటి ప్రదర్శనలు భక్తులని అంతగానో ఆకట్టుకున్నాయి.

**పట్టణంలో ట్రాఫిక్ మళ్లింపు :**

రథోత్సవం కారణంగా సామర్లకోట పట్టణంలోని పిఠాపురం మెయిన్ రోడ్ లో వాహనాల రాకపోకలను పోలీసులు నిలిపివేసి ట్రాఫిక్ దారి మళ్ళించారు. బ్రౌన్ పేట సెంటర్ నుండి జూనియర్ కళాశాల, ప్రసన్నాంజనేయ స్వామి ఆలయం మీదుగా పెద్దాపురం రోడ్డు నుండి స్టేషన్ సెంటర్ కు, కాకినాడ, ద్వారపూడి, రాజమండ్రి నుంచి వచ్చే వాహనాలను స్టేషన్ సెంటర్, పెద్దాపురం రోడ్డు, మఠం సెంటర్, మెహర్ కాంప్లెక్స్, ప్రసన్నాంజనేయ స్వామి ఆలయం, ప్రత్తిపాడు సెంటర్ మీదుగా ప్రతిపాడు, పిఠాపురం ప్రాంతాలకు మళ్ళించారు. అలాగే రథోత్సవం సందర్భంగా పెద్దాపురం డిఎస్పి డి శ్రీహరిరాజు ఆధ్వర్యంలో ఏటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా భారీ బందోబస్తును నిర్వహించారు. రథోత్సవానికి ఆటంకంగా ఉండకుండా చూసే కార్యక్రమంలో భాగంగా పిఠాపురం రోడ్డులో గాంధీ బొమ్మ సెంటర్ నుండి బళ్ల మార్కెట్ సెంటర్ వరకు, గొల్లగూడెం రోడ్డు, గోలివారి వీధుల్లో గృహాలకు, దుకాణాలకు ఉన్న విద్యుత్ లైన్లను తొలగించడంతో ఆయా ప్రాంతాల ప్రజలు విద్యుత్ అంతరాయానికి ఇబ్బంది పడ్డారు. కాగా రాత్రి 12 గంటల తర్వాత స్టేషన్ సెంటర్కు చేరుకున్న రథోత్సవంలో భారీ బాణాసంచా పోటీలను నిర్వహించారు. విజేతలకు ప్రత్యేక బహుమతులను అందజేశారు.

## పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన జెసిటి.నిషాంతి

**అమలాపురం, విశ్వం వాయిస్ న్యూస్:** ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల శాసన మండలి పట్టభద్రుల ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా శాంతియుత వాతావరణంలో నిర్వ హించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ టీ నిషాతి పోలింగ్ సిబ్బందికి సూచించారు .ఆమె గురువారం స్థానిక తాసిల్దార్ కార్యాలయం లో ఏర్పాటు చేసిన 213 పోలింగ్ కేంద్రాన్ని సందర్శించి పోలింగ్ నిర్వ హణ తీరు, సరళిని పర్యవేక్షించారు. అదే విధంగా పోలింగ్ కేంద్రం పరిసర ప్రాంతాలలో పర్యటించి పోలింగ్ కేంద్రానికి 100 మీటర్ల పరిధిలో ఎటువంటి ప్రచారాలు నిర్వహిం చరాదని వ్యక్తులు గుంపులుగా సంచరించ కుండా శాంతిభద్రతలను కాపాడేందుకు భద్రతా చర్యలు బలోపేతం చే యాలని పోలీస్ సిబ్బం దిని ఆదేశించారు. ఓటింగ్ శాతం వివరా లను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు ఎటు వంటి అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా ఎన్నికల పోలిం గ్ ప్రక్రియను సమర్థవం తంగా నిర్వహించాల న్నారు ఎన్నికల నిర్వ హణ లో పోలింగ్ ప్రక్రియ అత్యంత కీలకమన్నారు రహస్య ఓటింగ్ విధానా నికి భంగం వాటిల్లకుండా నిష్పక్షపాతం పారదర్శకం ప్రశాంతంగా పోలింగ్ ను సజావుగా నిర్వహించి ప్రక్రియను విజయవంతం చేయాలని ఆదేశించారు. సూక్ష్మ పరిశీలకులు బాధ్యతగా జవాబుదారి తనంతో మొత్తం ప్రక్రియ ను నిశితంగా పరిశీలిం చాలన్నారు. విధి నిర్వ హణలో ఎటువంటి అలసత్వానికి తావు లేకుండా అప్రమత్తంగా సిబ్బంది పని చేయాలన్నారు ఈ కార్యక్రమంలో స్థానిక తహసిల్దార్ అశోక్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

### పిఠాపురంలో ప్రశాంతంగా ఎమ్మెల్సీ పోలింగ్

**పిఠాపురం, విశ్వం వాయిస్ న్యూస్:** నియోజకవర్గంలో పిఠాపురంలో పట్టణంలో 6, గొల్లప్రోలులో 3,యు కొత్తపల్లి 3 మొత్తం 12 పోలింగ్ కేంద్రాల్లో పోలింగ్ అధికారులు నిర్వహిస్తున్నారు.ఆయా పోలింగ్ కేంద్రాల వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటన చోటుచేసుకోకుండా ఉండేందుకు పిఠాపురం సర్కిల్ ఇన్స్పెక్టర్ జి శ్రీనివాస్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహిస్తున్నారు.

## పిఠాపురంలో టిడిపి నాయకుల ఆధ్వర్యంలో డబ్బులు పంపిణీ



**పిఠాపురం, విశ్వం వాయిస్ న్యూస్:** కాకినాడ జిల్లా పిఠాపురంలో టిడిపి నాయకులు ఓటర్లను ప్రలోభాలకు గురిచేస్తున్నారు. పట్టణంలోని 93, 96, 97 పోలింగ్ బూత్‌ల పరిధిలోని ఓటర్లకు స్వయంగా టిడిపి పిఠాపురం మండల అధ్యక్షుడు ఎస్.గంగాధర్ ఓటుకు రూ.3వేలు చొప్పున బహిరంగంగానే పంచిపెట్టారు. దూర ప్రాంతాల నుంచి వచ్చిన ఓటర్లకు స్థానిక మున్సిపల్ కళ్యాణ మండపంలో ఈ డబ్బులు పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానికుల ద్వారా సమాచారం తెలుసుకున్న తహశీల్దార్ పి.గోపాలకృష్ణ, పిఠాపురం సిఐ జి.శ్రీనివాస్ అక్కడికి చేరుకున్నారు. దీంతో నాయకులు కళ్యాణ మండపం నుంచి బయటకు వచ్చేశారు. మున్సిపల్ కళ్యాణమండపం వద్ద ఉన్న అందర్నీ పోలీసులు అక్కడ నుంచి పంపిచేశారు. మున్సిపల్ కళ్యాణ మండపానికి తాళాలు వేశారు. ప్రస్తుతం ఎవరిపైనా ఎటువంటి కేసులు నమోదు చేయలేదు.

## కంటి వైద్య ఆవశ్యకత గుర్తించాలి

- పులివెందులలో నేత్రాలయం ప్రారంభం
- ఐటీ వింగ్ అధ్యక్షులు యరమాటి వెంకన్నబాబు హర్షం



**మండపేట టౌన్, విశ్వం వాయిస్ న్యూస్ :** వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి కంటి సమస్యలతో బాధపడుతున్న పేద ప్రజల కోసం శస్త్ర శిక్షలు నిర్వహించడానికి పులివెందులలో ఎల్ వీపిఈఐ సహకారంతో అత్యాధునిక సౌకర్యాలతో 10 కోట్ల సొంత నిధులను వెచ్చించి వైయస్ రాజారెడ్డి కంటి హాస్పిటల్ ప్రారంభించడం సంతోషకరమని మండపేట నియోజకవర్గం ఐటీ వింగ్ అధ్యక్షులు యరమాటి వెంకన్నబాబు పేర్కొన్నారు. గురువారం విజయలక్ష్మి నగర్లో పార్టీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్ రాష్ట్రంలో అన్ని ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాల్లో కంటి వైద్యం అందుబాటులోకి తీసుకొచ్చారని అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లో ఈ వైద్య సేవలను నిర్వీర్యం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. నిరుపేదలకు జగన్ కంటి చూపులు కల్పిస్తే కూటమి ప్రభుత్వం ఆ చూపులను అంధకారంలోకి నెట్టేసిందని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాలలోను ఐ ఆసుపత్రులను పునరుద్ధరించాలని వెంకన్నబాబు డిమాండ్ చేశారు.

ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవడం ద్వారా

## తన వంతు పాత్ర పోషించాలి

- ఎన్నికల సహాయ రిటర్నింగ్ అధికారి బిఎల్ఎన్.రాజకుమారి



**అమలాపురం టౌన్, విశ్వం వాయిస్ న్యూస్ :** పట్టభద్రులు అయ్యి ఓటరు గా నమోదైన ప్రతి ఒక్కరూ ఆదర్శవంత మైన ప్రజా స్వామ్య వ్యవస్థ కోసం ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవడం ద్వారా తన వంతు పాత్ర పోషించాలని జిల్లా రెవెన్యూ అధికారి ఎన్నికల సహాయ రిటర్నింగ్ అధికారి బిఎల్ఎన్ రాజకుమారి అన్నారు గురువారం ఎస్ కే వి ఆర్ కళాశాల నందు ఏర్పాటు చేసిన( 215,216,217) మూడు పోలింగ్ కేంద్రాలను జిల్లా పరిషత్ ఉన్నత పాఠ శాల నందు ఏర్పాటుచేసిన (222 ,215) రెండు పోలింగ్ కేంద్రాలను ఆమె సందర్శించి ఓటింగ్ నిర్వహణ తీరు ను పరిశీలించి సిబ్బందికి తగు సూచనలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల శాసన మండలి పట్టపద్రుల పోలింగ్ ప్రక్రియలో సిబ్బంది అంకిత భావంతో ఎన్ని కల సంఘం మార్గదర్శకా లకు అనుగు ణంగా పని చేసి పోలింగ్ ను విజయవంతం గావించాల న్నారు ప్రజాస్వామ్యంలో ఎన్ని కల పాత్ర చాలా గొప్పదని ఆరోగ్యకరమైన ప్రజాస్వా మ్యానికి స్వేచ్ఛాయుత మైన ఎన్నికలు ముఖ్యమన్నారు. ప్రజాస్వామ్యంలో తమ హక్కులు కాపాడు కోవడం పౌరులందరి బాధ్యత ఆ న్నారు. జిల్లా యంత్రాంగం స్వేచ్ఛగా నిష్పక్షపాతంగా ఎన్నికలు నిర్వ హించడం జరుగుతోదన్నారు. పట్టభద్రుల ఓటు హక్కు ద్వారా నిజాయితీకి కార్యదక్షతకు పట్టంకట్టే ప్రజాప్రతినిధులను ఎన్నుకొని మెరుగైన ప్రజా పాలనకు బాటలు వేయాలన్నారు. భావి భారత నిర్మాణంలో ఓటర్లది నిర్ణయాత్మక పాత్రన్నారు. దేశ పౌరులకు భారత రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కు ఎంతో విలువైనదన్నారు.

దానిని ప్రతి ఒక్కరూ సద్విని యోగం చేసుకోవాలన్నారు ప్రపం చంలోనే మన దేశం అతి పెద్ద ప్రజాస్వామ్యం కలిగి ఉందని, ఎన్నికల సమయంలో ఎలాంటి ప్రలోభాలకు లొంగ కుండా ఓటు వేయాలన్నారు. ఆదర్శ వంతమైన ప్రజా స్వామ్య వ్యవస్థ కోసం ప్రతి ఒక్కరూ సమాజంలో తమ వంతు పాత్ర పోషించాలన్నారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ అశోక్ కుమార్ తదితరులు పాల్గొన్నారు

రండి బాబు రండి చికెన్‌కు బర్డ్ ఫ్లూ లేదు..

## బహటాంగా తినేయచ్చు



**రామచంద్రపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** రామచంద్రపురం పట్టణం మరియు గ్రామీణ మండలం పరిసర ప్రాంతాల్లో చికెన్,ఎగ్ వినియోగదారులో బర్డ్ ఫ్లూ వ్యాధి పట్ల ఉన్న భయాన్ని పోగొట్టి, చికెన్‌పై ఉన్న అపోహలను తొలగించేందుకు గాను గురువారం సాయంత్రం 5.30కి వెంకాబ్ చికెన్ సౌజన్యంతో స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ రోడ్డు ప్రసన్న విఘ్నేశ్వర కళ్యాణ మండపం ఎదురుగా కోడిమాంసం వ్యాపారస్తుల సంఘం అధ్వర్యంలో గ్రాండ్ చికెన్ మేళాను ఏర్పాటు చేశారు. దీనిలో భాగంగా ప్రత్యేక షామియానాలో చికెన్ కౌంటర్ ను ఏర్పాటు చేసి గాధంశెట్టి శ్రీధర్ చేతులు మీదగా ఒక్కొక్కరికి రెండు గుడ్లు చికెన్ ఫ్రై,చికెన్ కర్రీ ఒక ప్లేట్లో పెట్టి ఉచితంగా పంపిణీ చేశారు. దాంతో బర్డ్ ఫ్లూని పక్కన పెట్టేసి వందల సంఖ్యలో స్థానికులు ఉచితంగా పంపిణీ చేసే చికెన్ కోసం బారులు తీరి మరీ ఎగబడ్డారు. వారంతా ఇష్టారాజ్యంగా చికెన్ రుచిని ఆస్వాదించారు. ఈ కార్యక్రమంలో రెడ్డి సురేష్, ఉదయ్ కాంత్, అమలదాసు రాజు తదితరులు పాల్గొన్నారు.

## మండపేటలో ఎమ్మెల్సీ ఎన్నికల్లో 79.28 శాతం ఓటింగ్

### ప్రశాంతంగా ముగిసిన ఎన్నిక

**మండపేట టౌన్, విశ్వం వాయిస్ న్యూస్ :** ఉభయ గోదావరి జిల్లా పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో మండపేట టౌన్ రూరల్ లో కలిపి మొత్తం 79.28 శాతం ఓటింగ్ నమోదు అయింది.పోలింగ్ బూత్ వారీగా పరిశీలిస్తే వేగుళ్ల సూర్యారావు ప్రభుత్వ ఉన్నత పాఠశాల పి ఎస్ నెంబర్ 153 లో 77.97 శాతం, పి ఎస్ నెంబర్ 154 లో 78.11శాతం, పి ఎస్ నెంబర్ 155లో 80.31 శాతం, పి ఎస్ నెంబర్ 156లో 81.07 శాతం ఓటింగ్ నమోదు అయింది. మండపేట డాక్టర్ పాలడుగు సత్యవతి చంద్రమౌళి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పిఎస్ నెంబర్ 157 లో 83 శాతం, 158 లో 81.10 శాతం, 159 లో 74.47 శాతం ఓటింగ్ నమోదు అయింది. మండపేట శ్రీ రామ హిందు స్కూల్లో 160 లో 78.81 శాతం ఓటింగ్ నమోదు అయింది. పురుషులు 2295 మంది, మహిళలు 1711 మంది మొత్తం 400 6 మంది ఓటర్లు ఉన్నారు. పురుషులు 1863 మంది, మహిళలు 1313 మంది మొత్తం 3,176 మంది ఓట్లు వేశారు. దీంతో మొత్తం శాతం 79.28 గా నమోదు అయింది. ఈ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. రామచంద్రపురం డిఎస్పీ రఘువీర్ ఆధ్వర్యంలో సి ఐ లు దొరరాజు, సురేష్‌లు బందోబస్తు నిర్వహించారు. తహసిల్దార్ తేజశ్వరరావు, డిప్యూటీ తహసీల్దార్ మెహర్ బాబా రెవెన్యూ సిబ్బంది ఎన్నికలను పర్యవేక్షించారు.





## విశ్వ బ్రాహ్మణ సంఘం నూతన అధ్యక్షుడిగా గానాల గంగాధర్

**ఏలేశ్వరం, ప్రత్తిపాడు, విశ్వంవాయిస్ న్యూస్:** కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండల విశ్వ బ్రాహ్మణ సంఘం నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అధ్యక్షుడిగా గానాల గంగాధర్, ఉపాధ్యక్షుడిగా ధరణాలకోట వీరబాబు, కార్యదర్శిగా ధరణాలకోట కన్నాబత్తుడు,సహాయ కార్యదర్శిగా ఎ.రమణ, కోశాధికారిగా కృష్ణవరపు శివలని సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికైన సభ్యులని పలువురు అభినందించారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు గానాల గంగాధర్ మాట్లాడు తూ విశ్వ బ్రాహ్మణ సంఘ బలోపేతానికి తన వంతు కృషి చేస్తానన్నారు. సభ్యులకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా క్రమశిక్షణ కమిటీ వైస్ చైర్మన్ ధరణాలకోట శ్రీను,అరసాల చిట్టిబాబు, సింహాద్రి వెంకట్రావు, ధరణాలకోట గోపయ్య గుండుమళ్ల చిట్టియ్య, దవరసింగ్ అబ్బులు,ఇతర కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



## ట్రైనీ డిఎస్పికి సిఐ భీమరాజు సూచనలు

**అంబాజీపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** అంబాజీపేట హైస్కూల్ లో పట్టుభద్రుల ఎంఎల్సి పోలింగ్‌ను సిఐ రుద్రరాజు భీమరాజు పర్యవేక్షణలో గురువారం ట్రైనీ డిఎస్పి పి.ప్రదీప్తి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ట్రైనీ డిఎస్పికి పలు సూచనలు ఇచ్చారు. ఓటర్ల క్యూ లైన్ లో ఓటు వినియోగించుకునేలా ప్రదీప్తి క్యూలైన్ సరి చేశారు. పోలింగ్ కేంద్రం ఎదురుగా ప్రధాన రహదారిలో పోలింగ్ కు అంతరాయం లేకుండా ట్రాఫిక్ నిర్వహణపై సిఐ భీమరాజు పలు సూచనలు చేశారు. పోలింగ్ ప్రశాంతంగా నిర్వహించేలా చర్యలు చేపట్టారు. ఆమె వెంట స్థానిక ఎస్ఐ కె.చిరంజీవి, తహశీల్దార్ జె.వెంకటేశ్వరి, రెవెన్యూ, పోలీస్ సిబ్బంది, మహిళా పోలీసులు పాల్గొన్నారు.







## ఏలేశ్వరం మండలంలో
# ప్రశాంతంగా సాగిన ఎమ్మెల్సీ ఓటింగ్ ప్రక్రియ





**ఏలేశ్వరం, విశ్వం వాయిస్ న్యూస్:** కాకినాడజిల్లా ఏలేశ్వరం ఉభయగోదావరి జిల్లా పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నిక ప్రక్రియ ప్రశాంతంగా ముగిసింది. ఏలేశ్వరం మండలములో మూడు పోలింగ్ కేంద్రాలలో మొత్తం 1929 వాటర్లకు గాను1442 మంది గ్రాడియేట్స్ తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మండల వ్యాప్తంగా 74.75% శాతం ఓటింగ్ నమోదు కాగా అత్యధికముగా16వ బూత్ నందు 76.33% 18వ బూత్ నందు 75.52% 17.వ బూత్ నందు 72.19 శాతం నమోదైనది. దీనిలో అత్యధికంగా పురుషులు 942 మంది ఓటు హక్కు వినియోగించుకోగా మహిళల 500 మంది తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. ఉదయం 7 గంటలకు ప్రారంభమైన ఓటింగ్ ప్రక్రియసాయంత్రం 4గంటలు వరకూ కొన సాగింది. స్థానిక ఎమ్మార్వో కుసరాజు, పోలింగ్ కేంద్రాలను పరిశీలిస్తూ రెవిన్యూ అధికారులకు తగు సూచనలు జారీ చేశారు. ప్రత్తిపాడు సర్కిల్ ఇన్స్పెక్టర్ సూర్య అప్పారావు సూచనల మేరకు సబ్ ఇన్స్పెక్టర్ రామ లింగేశ్వరరావు పోలీస్ సిబ్బంది పోలింగ్ కేంద్రాల వద్ద ఎన్నికల ప్రశాంతంగా జరిగేలా చర్యలు చేపట్టారు. ఆరోగ్య సిబ్బంది పోలింగ్ కేంద్రాల వద్ద తమ విధులు నిర్వర్తించారు. పలువురు ప్రముఖులు ఆయా పోలింగ్ కేంద్రాల్లో ఓటు హక్కును వినియోగించుకున్నారు.



## రామచంద్రపురం, కాజులూరులో ప్రశాతంగా ముగిసిన గ్రాడ్యుయేట్ పోలింగ్

**- రామచంద్రపురంలో 68 శాతం పోలింగ్ నమోదు - కాజులూరులో 63.16 శాతం నమోదు**



**రామచంద్రపురం నియోజకవర్గం, విశ్వం వాయిస్ న్యూస్ :** ఉమ్మడి తూర్పు పశ్చిమ గోదావరి జిల్లాల గ్రాడ్యుయేట్ ఓటర్ల ఎన్నికకు సంబంధించి పోలింగ్ గురువారం రామచంద్రపురం పట్టణంలో ఏర్పాటు చేసిన ఏడు పోలింగ్ కేంద్రాల్లో ప్రశాంతంగా ముగిసింది.పోలింగ్ సమయం ముగిసేసరికి ఇక్కడ ఏర్పాటు చేసిన ఏడు పోలింగ్ బూతుల్లో 68 శాతం ఓటింగ్ నమోదయిందని రామచంద్రపురం ఆర్డిఓ దేవరకొండ అఖిల పేర్కొన్నారు. రామచంద్రపురం మండలం, రామచంద్రపురం టౌన్ పరిదిలో 5392 మంది ఓటర్లు ఉన్నారు.గురువారం పోలింగ్ సమయం. ముగిసేసరికి 166 వ,భూత్లో 618 ఓటర్లుకు 431 మంది తమతమ ఓటుహక్కును వినియోగించుకున్నారు.167 భూత్లో,837 మంది ఓటర్లు ఉండగా 588 మంది ఓటర్లు తమతమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. అలాగే168 పోలింగ్ బూత్లో 795,మంది ఓటర్లకు గాను, 551మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు, అలాగే 169 వ,బూత్లో 677 మంది ఓటర్లకు గాను 464 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. అదే విధంగా 170,వ బూత్లో 828 మంది ఓటర్లకు గాను 555 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.అలాగే 171 వ,భూత్లో 909 మంది ఓటర్లుకు గాను 578 ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. అలాగే 172 వి,భూత్లో 728 మంది ఓటర్లుకు గాను 500 మంది ఓటర్లు తమతమ ఓటు హక్కు వినియోగించుకున్నారు దీంతో మొత్తం 7 పోలింగ్ బూత్లో 68 శాతం ఫోలోంగ్ నమోదు అయ్యిందని తెలిపారు. అలాగే ఆయా బూతుల్లో 24 మంది సిబ్బందిలో పిఓ,ఓపిఓ ,మైక్రో అబ్జర్వర్సు, తమ తమ విదులు నిర్వహించగా, రామచంద్రపురం డిఎస్పి రఘువీర్ ఆధ్వర్యంలో ఈ ఎమ్మెల్సీ ఎన్నిక పోలింగ్ పురస్కరించుకుని ద్రాక్షారామం, రామచంద్రపురం పోలీసుస్టేషన్ల పరిదిలో ఎస్సైలు, ఎం.లక్ష్మణ్, నాగేశ్వర రావులు తమ సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు, పోలింగ్ జరిగా ప్రదేశాల్లో 189/2 ప్రకారం ఆయాచోట్ల నిబంధనలు పాటించాలని హెచ్చరించారు. దీంతో ఉదయం పోలింగ్ ప్రారంభం నుంచి ముగిసే వరకు పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది పోలింగ్ సరళిని రామచంద్రపురం ఆర్డిఓ దేవరకొండ అఖిల అయాచోట్ల పరిశీలించిచారు. ఈసందర్భంగా రామచంద్రపురం డిఎస్పీ రఘువీర్ పర్యవేక్షణలో ఎటువంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. కాజులూరు మండలంలో కూడా ప్రశాంతంగా ముగిసింది. పోలింగ్ సమయం ముగిసేసరికి ఇక్కడ ఏర్పాటు చేసిన నాలుగు పోలింగ్ బూతుల్లో 63.16% ఓటింగ్ నమోదయిందని కాజులూరు తహసిల్దార్ జీ.ఆర్.ఠాగూర్ పేర్కొన్నారు.మండల పరిధిలో మొత్తం 2351 మంది గ్రాడ్యుయేట్ ఓటర్లు ఉండగా 1282 మంది తమతమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. ఉదయం 11 గంటల సమయానికి కేవలం 19 శాతం శాతం ఓట్లు పోలింగ్ కాగా పోలింగ్ ముగిసిన సమయానికి 173 పోలింగ్ బూత్లో 619 మంది ఓటర్లకు గాను,392 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు, అలాగే ఆయా బూతుల్లో 24 మంది సిబ్బందిలో పిఓ,ఓపిఓ, మైక్రో అబ్జర్వర్సు, తమతమ విదులు నిర్వహించగా, గొల్లపాలెం ఎస్సై మోహన్ కుమార్ ఆధ్వర్యంలో ఈ ఎమ్మెల్సీ ఎన్నిక పోలింగ్ పురస్కరించుకుని బందోబస్తు నిర్వహించారు, పోలింగ్ జరిగా ప్రదేశాల్లో 189/2 ప్రకారం ఆయాచోట్ల నిబంధనలు పాటించాలని హెచ్చరించారు. దీంతో ఉదయం పోలింగ్ ప్రారంభం నుంచి ముగిసే వరకు పోలింగ్ ప్రశాంతంగా ముగిసిందని కాజులూరు తహసీల్దార్ ఠాగూర్ ఈసందర్భంగా పేర్కొన్నారు.

## రౌతుపాలెంలో భక్తిశ్రద్ధలతో
## ఘనంగా కొండరాజుల పండుగ





**ఏలేశ్వరం, ప్రత్తిపాడు, విశ్వం వాయిస్ న్యూస్:** కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం రౌతుపాలెం గ్రామ ప్రజలు కొండ రాజులబాబు పండగ ఘనంగా నిర్వహించారు.రౌతుపాలెం గ్రామంలో గ్రామ ప్రజలు అందరూ కలిసి కొండరాజులు బాబు పండగ నిర్వహించారు. గ్రామంలో ఎన్నో ఏళ్ళ నుంచి ఆచారంగా వస్తున్నా ఈ పండుగను నిర్వహించడం చాలా అనందంగా ఉందన్నారు. మహాశివరాత్రి పర్వదినం తరువాత ఈ పండుగను నిర్వహిస్తామని, మా పెద్దలు కూడ అందరూ కలిసి చేసేవారని, కొండప్రాంతంలో వచ్చే వనరులపై జీవనం సాగించే వాళ్ళ అందరూ కూడా కొండరాజులు బాబుకి దణ్ణం పెట్టనిదే రోజు గడవదని,ఈ దేవుడు చాలా మహిమ గలవాడని అన్నారు. పిల్లలను కొండరాజులు బాబు వేసాధారణ వేయించి పండగ చేసే దగ్గర సందడి చేసారు.ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, యువకులు, ప్రజలు పాల్గొని భోజనాలు చేసి ఆనందగా గడిపారు.

## ప్రశాంతంగా ముగిసిన ఎమ్మెల్సీ ఎన్నికలు

**తాళ్ళరేవు, విశ్వం వాయిస్ న్యూస్:** ఉభయగోదావరి జిల్లాల ఎమ్మెల్సీ ఎన్నికలు గురువారం ప్రశాంతంగా జరిగాయి. మండల పరిధిలోని మండల ప్రజా పరిషత్ భవనం, సుంకరపాలెం పంచాయతీ ఆఫీస్, పటవల పంచాయతీ ఆఫీసులలో ఎమ్మెల్సీ పట్టభద్రుల ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. ఓటు హక్కు కలిగిన పట్టభద్రులు తమ విధిగా వచ్చి ప్రతి ఒక్కరు ఓటు హక్కు వినియోగించుకున్నారు. స్థానిక నాయకులు ఓటు హక్కు కలిగిన వారిని ప్రోత్సహించి, ఓటు వేసేలా చర్యలు తీసుకున్నారు. ఎమ్మార్వో, ఎండిఓ, స్టేషన్ హౌస్ ఆఫీసర్ ఆధ్వర్యంలో తాళ్ళరేవు మండల పరిధిలోని ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగింది.

# గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతం

**- పోలింగును పరిశీలించిన ఎమ్మెల్యే సత్యప్రభ - శంఖవరంలో 70.09 శాతం ఓట్ల నమోదు**
**- పార్టీల సమన్వయంతో శాంతియుత వాతావరణం**



**శంఖవరం, విశ్వం వాయిస్ న్యూస్:** ఉభయ గోదావరి జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలు కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం శంఖవరం మండలంలో శాంతియుత వాతావరణంలో సజావుగా కొనసాగి గురువారం ప్రశాంతంగా ముగిసాయి. శంఖవరం మండలం మొత్తం మీద 876 మంది గ్రాడ్యుయేట్ ఓటర్లు ఉన్నారు. మండల కేంద్రం శంఖవరంలోని తాహసిల్దార్ కార్యాలయంలోని వీడియో కాన్ఫరెన్స్ గదిలో ఏర్పాటు చేసిన 21 వ సంఖ్య పోలింగు కేంద్రానికి 450 మంది ఓటర్లను, అలాగే స్థానిక ఎంపిడిఓ కార్యాలయంలోని 22 వ సంఖ్య పోలింగు కేంద్రానికి 420 మంది ఓటర్లనూ కేటాయించారు. ఉదయం 10, మధ్యాహ్నం 12, 2, సాయంత్రం 4 గంటల సమయాల్లోని పోలింగ్ సరళిని, నమోదైన ఓట్ల సంఖ్యలను ఎన్నికల అధికారులు ప్రత్యేకంగా నమోదు చేశారు. సాయంత్రం 4 గంటల సమయానికి రెండు చోట్లా కలిసి 621 ఓట్లతో 70.09 ఓట్ల శాతం నమోదైంది. ఈ రెండు ఓట్ల నమోదు కేంద్రాల ఓట్ల సరళిని ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ ఉదయం 11 గంటల సమయంలో పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఏర్పాట్ల గురించి అధికారులను ఆమె అడిగి తెలుసు కున్నారు. ఎటువంటి సమస్యలు లేకుండా ఎన్నికల ప్రశాంత వాతావరణంలో జరిగేలా చూడాలని అధికారులను ఎమ్మెల్యే సత్యప్రభ కోరారు. ఉదయం పూట మందకొడిగా మొదలైన ఓట్ల నమోదు ప్రక్రియ మధ్యాహ్నం 12 గంటల వరకూ అలాగే కొనసాగింది. ఆ తర్వాత నుంచి వేగం పుంజుకుంది. శంఖవరంలోని రెండు ఎన్నికల కేంద్రాలకూ నిర్ణీత దూరం దాటి ఇటు ఎన్.డి.ఏ. కూటమి పక్షాలు, అటు ఉపాధ్యాయ సంఘాలు తరఫున రెండు వేర్వేరు శిబిరాలను ఏర్పాటు చేసుకున్నారు. 29 మార్చి 1982 లో తెలుగు దేశం పార్టీ ఆవిర్భావం నుంచి ప్రత్తిపాడు మాజీ ఎమ్మెల్యేలు పర్వత సుబ్బారావు, పర్వత బాపనమ్మ, పర్వత శ్రీ సత్యనారాయణ మూర్తిలకు కుడిభుజంగా ఉంటూ నేటికీ ఇదే పార్టీలో కొనసాగుతున్న



నియోజకవర్గం సీనియర్ నేత పర్వత సురేష్ శంఖవరం మండల ఎన్నికలకు పూర్తి భాధ్యత వహిస్తూ ఎన్నికల వ్యూహం రచన, అమలు అంతా తానై నడిపించారు. అంతే కాకుండా ఎన్.డి.ఏ. కూటమి పార్టీల శ్రేణులకు శంఖవరంలోని తన స్వగృహంలో మధ్యాహ్నం పూట భోజన సౌకర్యం కల్పించారు. పోలీసులు శాంతి భద్రతలను పర్యవేక్షించారు. ఈ ఎన్నికలు సజావుగా నిర్వహించడంలో ఎన్నికల, రెవిన్యూ, రక్షకభట శాఖలతో పాటు ఎన్.డి.ఏ. కూటమి భాగస్వామ్య పార్టీల శ్రేణులు కూడా సంయమనంతో మెలగి, అధికారులతో సమన్వయం పాటించి కీలకంగా వ్యవహరించాయి. ఈ ఎన్నికల్లో ఎన్డీయే కూటమి ఎమ్మెల్సీ అభ్యర్థికే అత్యధిక శాతం ఓట్లు నమోదై ఘన విజయం సాధిస్తారని ఆ పార్టీల శ్రేణులు తమ ఆశా భావాన్ని వ్యక్తం చేస్తున్నారు. ఏదైతేనేం ఈ ఎన్నికలు ఆసాంతం శాంతియుత వాతావరణంలో ప్రశాంతంగా దిగ్విజయంగా ముగిసాయి.

## చిరు వ్యాపారికి గౌడ సంఘం నాయకులు పరామర్శ

**మండపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** మండపేట పట్టణానికి చెందిన చిరు వ్యాపారి తీగిరెడ్డి శేఖర్‌ను గౌడ సంఘం నాయకులు గురువారం పరామర్శించారు. ఇటీవల శేఖర్‌పై గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో దాడి ఘటన సమాచారం అందుకున్న వారు తమ సంఘీభావం తెలిపారు. బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి సుశీల, జై గౌడ సేన రాష్ట్ర కార్యదర్శి వంకా రామకృష్ణ, జాతీయ బిసి సంఘం నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి తీగిరెడ్డి మహేష్ వారి కుటుంబాన్ని కలసి యోగ క్షేమాన్ని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శేఖర్ కుటుంబ కు అండగా ఉంటామని చెప్పారు. కన్ను, చేతికి గాయం అయ్యాయని పేర్కొన్నారు. పోలీసులు త్వరగా దర్యాప్తు చేపట్టి దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.




### పోలింగ్ ప్రక్రియలో సిబ్బంది అంకితభావంతో
## పని చేసే విజయవంతం చేయాలి

**- రిటర్నింగ్ అధికారి బిఎల్.ఎన్.రాజకుమారి**



**అమలాపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** పట్టభద్రులు అయ్యి ఓటరుగా నమోదైన ప్రతి ఒక్కరూ ఆదర్శవంత మైన ప్రజా స్వామ్య వ్యవస్థ కోసం ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవడం ద్వారా తన వంతు పాత్ర పోషించాల ని జిల్లా రెవెన్యూ అధికారి ఎన్నికల సహాయ రిటర్నిం గ్ అధికారి బి ఎల్ ఎన్ రాజకుమారి అన్నారు గురువారం ఎస్ కే వి ఆర్ కళాశాల నందు ఏర్పాటు చేసిన( 215,216,217) మూడు పోలింగ్ కేంద్రాలను జిల్లా పరిషత్ ఉన్నత పాఠ శాల నందు ఏర్పాటుచేసిన (222 ,215) రెండు పోలింగ్ కేంద్రాలను ఆమె సందర్శించి ఓటింగ్ నిర్వహణ తీరు ను పరిశీలించి సిబ్బందికి తగు సూచనలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల శాసన మండలి పట్టపద్రుల పోలింగ్ ప్రక్రియలో సిబ్బంది అంకిత భావంతో ఎన్ని కల సంఘం మార్గదర్శకా లకు అనుగు ణంగా పని చేసి పోలింగ్‌ను విజయవంతం గావించాల న్నారు ప్రజాస్వామ్యంలో ఎన్ని కల పాత్ర చాలా గొప్పదని ఆరోగ్యకరమైన ప్రజాస్వామ్యానికి స్వేచ్ఛాయుత మైన ఎన్నికలు ముఖ్యమన్నారు. ప్రజాస్వామ్యంలో తమ హక్కులు కాపాడుకోవడం పౌరులందరి బాధ్యత అన్నారు. జిల్లా యంత్రాంగం స్వేచ్ఛగా నిష్పక్షపాతంగా ఎన్నికలు నిర్వహించడం జరుగుతోదన్నారు. పటభద్రుల ఓటు హక్కు ద్వారా నిజాయితీకి కార్యదక్షతకు పట్టం కట్టే ప్రజాప్రతినిధులను ఎన్నుకొని మెరుగైన ప్రజా పాలనకు బాటలు వేయాలన్నారు. భావి భారత నిర్మాణంలో ఓటర్లది నిర్ణయాత్మక పాత్రన్నారు. దేశ పౌరులకు భారత రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కు ఎంతో విలువై నదన్నారు దానిని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు ప్రపంచంలోనే మన దేశం అతి పెద్ద ప్రజాస్వామ్యం కలిగి ఉందని, ఎన్నికల సమయంలో ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా ఓటు వేయాలన్నారు. ఆదర్శవంతమైన ప్రజా స్వామ్య వ్యవస్థ కోసం ప్రతి ఒక్కరూ సమాజంలో తమ వంతు పాత్ర పోషించాల న్నారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ అశోక్‌కుమార్ తది తరులు పాల్గొన్నారు.



## ప్రశాంతంగా ముగిసిన ఎమ్మెల్సీ ఎన్నికలు

**కోరుకొండ విశ్వం వాయిస్ న్యూస్:** పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు గురువారం ప్రశాంతంగా ముగిసాయి. గురువారం ఎమ్మెల్సీ ఎన్నికలు ఉదయం 8 గంటల నుండి సాయంకాలం నాలుగు గంటల వరకు పట్టభద్రులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా ఎన్డీఏ కూటమి నాయకులు కోరుకొండ, రాజానగరం సీతానగరం మండల ఎన్నికల శిబిరాల్లో ఎప్పటికప్పుడు ఓటింగ్ సరళిని పరిశీలించుకుంటూ, ఓటింగ్ శాతాన్ని పెంచడానికి తగు చర్యలు చేపట్టారు. రాజానగరం శాసనసభ్యులు బత్తుల బలరామకృష్ణ, రుడా చైర్మన్ రాజానగరం నియోజకవర్గ తెదేపా ఇంచార్జ్ బొడ్డు వెంకటరమణ చౌదరి, రాజానగరం నియోజకవర్గం భాజపా కన్వీనర్ నీరుకొండ వీరన్న చౌదరి, కోరుకొండ భాజపా అధ్యక్షులు అడపా సుధీర్ కుమార్, ఎన్డీఏ కూటమి నాయకులు ఎన్డీఏ కూటమి ఎమ్మెల్సీ అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్ విజయానికి అహర్నిశలు శ్రమించి, పార్టీ అధినేతల ఆజ్ఞల ప్రకారం భారీ మెజారిటీ తీసుకురావడానికి శతవిధాల తమ ప్రయత్నాలు ముమ్మరం చేశారు. అత్యధిక మెజారిటీతో పేరాబత్తుల విజయం తథ్యమని ఎన్డీఏ కూటమి నాయకులు ధీమా వ్యక్తం చేస్తున్నారు.

## శివరాత్రికి భక్తులకు వైఎంవిఎ ఆధ్వర్యంలో ప్రసాద వితరణ




**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్:** మహాశివరాత్రి సందర్భంగా గోదావరి పుణ్యస్నానాలకు విచ్చేసిన భక్తులకు యంగ్ మెన్స్ వైశ్యా హాస్టల్స్ (వైఎంవిఎ) ఆధ్వర్యంలో భారీ ప్రసాద వితరణ జరిగింది. వైశ్య ప్రముఖుడు, ఏపిఐఐసి మాజీ చైర్మన్ శ్రీఘాకొళ్ళపు శివరామ సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో సంస్థ అధ్యక్షుడు మైలవరపు శ్యామలరావు అధ్యక్షతన గోదావరి గట్టున ఉన్న వైఎంవిఎ హాలువద్ద ఈ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన సంస్థ మాజీ కార్యదర్శి మాజేటి వెంకటరమణ చేతుల మీదుగా భక్తులకు ప్రసాద వితరణ చేశారు. సుమారు 5 వేలమందికి ప్రసాద వితరణ చేసినట్లు నిర్వా హకులు తెలిపారు.కార్యక్రమంలో వైఎంవిఎ కార్యదర్శి కన్నెగోళ్ళ రవికాంత్, కోశాధికారి వెత్సా వెంకట కిషోర్, మాజీ అధ్యక్షులు,మాజీ కార్యదర్శులు, సభ్యులు పాల్గొన్నారు.



# గోవుల అక్రమ రవాణాను అరికట్టాలి

## - రవాణా సహకరిస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలి





**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్:** గోవులను అక్రమ రవాణా ను అరికట్టాలని భారత్ శక్తిపీఠం అధ్యక్షులు, హిందూ మహాసభ దక్షిణ భారత ఆర్గనైజింగ్ సెక్రటరీ శ్రీ భారతానంద్ మహారాజ్ పేర్కొన్నారు.గురువారం విశాఖపట్నం నుంచి, రాజమహేంద్రవరం విచ్చేసిన ఆయన జిల్లా ఎస్పీకి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గోవుల అక్రమ రవాణాను పోలీసు వారే ప్రోత్సహిస్తున్నారని ఆరోపించారు. పశువుల అక్రమ రవాణా అడ్డుకోకుండా రవాణా చేస్తున్న ముద్దాయిలకు రాజానగరం పోలీసులు సహకారం అందిస్తున్నారని అన్నారు. ఆంధ్రప్రదేశ్ గోహత్య నిషేధ చట్టం, జంతు సంరక్షణ చట్టం 1970 ప్రకారం రాజానగరం సర్కిల్ ఇన్స్పెక్టర్ పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈనెల 20న గోవుల అక్రమ రవాణా కోసం తగు చర్యలు తీసుకోవలసినదిగా వినతిపత్రం సమర్పించామని తెలిపారు. అయితే ఈ నెల 26వ తేదీన మహాశివరాత్రి సందర్భంగా రాజానగరం పోలీస్ స్టేషన్ పరిధిలో అక్రమంగా ఆవులను తరలిస్తున్న ఒక కంటైనర్ నెంబర్ %ూూూ%39యుఎక్స్0181 గల వాహనంలో సుమారు 40 వరకు ఆవులను ఇరికించి రవాణా చేస్తున్నారని అన్నారు. ఆ వాహనాన్ని హిందూ గో సేవా సమితి సభ్యులు,గోశాల నిర్వాహకుడు మా శిష్యుడు మోటుపల్లి సాయి మా గ్రూపులో రాబడిన సమాచారం మేరకు 112 కాల్ చేసి పోలీసు వారి సహకారంతో ఆవుల అక్రమ రవాణాను అడ్డుకొని పోలీసులకు అప్పగించాడని తెలిపారు. రాజానగరం సర్కిల్ ఇన్స్పెక్టర్ వెంటనే వాహనాన్ని స్టేషన్ కు తరలించకుండా రోడ్డుమీద ఆపి మాఫియా వారికి అనుగుణంగా మాట్లాడారని తెలిపారు. హిందువుల మనోభావాలు కించపరిచేలా ప్రవర్తించి చుట్టుపక్కల ఉన్న వారిని రెచ్చగొట్టే విధంగా ప్రవర్తించారని అన్నారు. యానిమల్ యాక్ట్ 1960 ప్రకారం అనుమతులు లేకుండా ఇరుకుగా లారీలు మూగజీవులను రవాణా చేసినందుకు కేసు నమోదు చేయకుండా నిర్లక్ష్య వైఖరి అవలంబించారని ఆరోపించారు. మాఫియాకి సహాయం చేసి ఆ వాహనాన్ని విడిచి పెట్టినందుకు సిఐను సస్పెండ్ చేయాలని కోరారు. అంతేకాకుండా కోరుకొండ శ్రీను అనే వ్యక్తి నెల నెలా పోలీస్ యంత్రాంగానికి మామూళ్లు కడుతున్నామని చెప్పి రాజానగరం సర్కిల్ ఇన్స్పెక్టర్ వారికి కూడా నెలవారీ మామూలు ఇస్తున్నామని చెప్పారని తెలిపారు.

ఈ సంఘటనలో రాజానగరం సర్కిల్ ఇన్స్పెక్టర్ వారిపై చర్యలు తీసుకోవాల్సిందిగా డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా రాజమహేంద్రవరం ఎస్పీకి వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్ర మంలో అమ్మానాన్న సేవా సమితి సంస్థ నెల్లూరు కావలికి చెందిన మంగళగిరి వేణుగోపాలరావు, సాధువులు, సన్యాసులు పాల్గొన్నారు.

# రాష్ట్రంలో రెడ్ బుక్ రాజ్యాంగ పాలన నడుస్తోంది

- *పరిపాలన గాలికి వదిలేసిన కూటమి ప్రభుత్వం...*
- *హామీల అమలులో కూటమి ప్రభుత్వం విఫలమైంది...*
- *డైవర్షన్ పాలిటిక్స్ లో భాగంగానే అక్రమ అరెస్టులు..*
- *పోసాని కృష్ణ మురళి అక్రమ అరెస్టును ఖండించిన జక్కంపూడి రాజా...*



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్:** గడిచిన తొమ్మిది నెలల్లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అధికార కూటమి ప్రభుత్వం ఏదోరకంగా శాంతి భద్రతలకు విఘాతం కలిగించే కార్యక్రమాలు చేస్తోందని వైయస్ఆర్సీపీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు,మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం నాడు పోసాని కృష్ణమురళి అక్రమ అరెస్టుపై మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా స్పందించారు. వై.యస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, నాయకులు మీద అక్రమ కేసులు బనాయించడంతో పాటు అర్ధరాత్రి పూట ఇళ్లకు వెళ్లి మహిళలను స్కెతం బెదిరిస్తు న్నారని మండిపడ్డారు. ఆరోగ్యం బాగాలేదని చెప్పినా అవేవీ లెక్కచేయకుండా అధికారం ఉంది కదా ఏం చేసినా చెల్లుతుందన్న ధోరణిలో వైయస్ఆర్సీపీ తరపున గొంతు కలిపిన ప్రతి ఒక్కరినీ ఇబ్బంది పెడుతున్నారని ఆక్షేపించారు. గడిచిన నెల రోజుల్లో వల్లభనేని వంశీ,పోసాని కృష్ణ మురళీల అరెస్టుల ద్వారా కూటమి ప్రభుత్వం డైవర్షన్ పాలిటిక్స్ కు పాల్పడు తోందని తెలిపారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నేటికి కూడా కూటమి ప్రభుత్వం నెరవేర్చలేకపోయిందని, తల్లికి వందనం గాలికి వదిలేసిందని, సూపర్ సిక్స్ ను పూర్తిగా అటకెక్కించిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వంలో పరిపాలన అనేదే లేదని రైతు భరోసా దేవుడికెరుక అన్నట్టు తయారైందన్నారు ఈ వైఫల్యాల నుంచి డైవర్షన్ కోసం నిత్యం ఏదో ఒక అంశాన్ని వెతుక్కుని దానిమీద ఓ రెండు వారాల పాటు నడిపించడం ప్రభుత్వానికి పరిపాటిగా మారిందన్నారు. కొత్త బడ్జెట్ ను ప్రవేశపెడుతున్న తరుణంలో అది ప్రజారంజకంగా లేదు కాబట్టి,ఎన్నికల్లో ఇచ్చి వాగ్దానాలకు అద్దం పట్టేటట్టు బడ్జెట్ కనిపించదు కాబట్టే డైవర్షన్ కు పాల్పుడుతున్నారని ఆగ్రహించారు. కూటమి ప్రభుత్వం తెరలేపిన ఈ కొత్త సంస్కృతి,సాంప్రదాయంతో రేపు మళ్లీ మీరు అదే బోనులో నిలబడాల్సి ఉంటుదన్న విషయాన్ని గుర్తు పెట్టుకోవాలని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.ప్రభుత్వం చేసే ప్రతి అరాచకాన్ని ప్రజలు నిశితంగా గమనిస్తున్నారు. ప్రభుత్వం మీద ప్రజల్లో ఇంత తీవ్రమైన స్థాయి లో వ్యతిరేకత ఎప్పుడూ చూడలేదన్నారు.

గద్దెనెక్కించిన ప్రజలే ప్రభుత్వాన్ని గద్దె దించే కార్యక్రమం చేస్తారని.. ప్రజలు తిరుగుబాటుకి సిద్ధంగా ఉన్నారని తేల్చి చెప్పారు.

# ఘనంగా అంతర్జాతీయ ఎన్జీవో దినోత్సవం

## ప్రజల అవసరాలు తీర్చడానికి అందరూ కలిసి పనిచేయాలి
## స్వచ్ఛంద సేవా సంస్థల డైరీ ముద్రణకు నిర్ణయం




**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్:** సమాజంలో పౌరుల తక్షణ అవసరాలు తీర్చడంలో స్వచ్ఛంద సేవా సంస్థల కృషి అమూల్యమైనదని స్వర్ణాంధ్ర సేవా సంస్థ ముఖ్య నిర్వాహకులు లైన్ డాక్టర్ గుబ్బల రాంబాబు అన్నారు.గురువారం మధ్యాహ్నం స్థానిక లాలాచెరువులో గల స్వర్ణాంధ్ర వృద్ధాశ్రమంలో జరిగిన అంతర్జాతీయ ఎన్జీవో దినోత్సవాన్ని పలు స్వచ్ఛంద సేవా సంస్థల సమక్షంలో కేక్ కట్ చేశారు .ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ వివిధ స్వచ్ఛంద సేవా సంస్థల మధ్య పరిచయం, సమన్వయం సాధించడం కోసం పూర్వపు ఉభయ జిల్లాల స్వచ్ఛంద సేవా సంస్థలతో ఒక డైరెక్టర్ ని రూపొందించనున్నట్లు రాంబాబు తెలిపారు.ఈ సందర్భంగా సుమారు 40 మంది స్వచ్ఛంద సేవా సంస్థల ప్రతినిధులను రాంబాబు ఘనంగా సత్కరించి జ్ఞాపికలను బహుకరించారు.ఈ కార్యక్రమంలో అనూప్ , జోషి బాబు, ప్రభుదాస్, పోసి కుమార్, మద్దాలను, రాజయోన, శకుంతల, లక్ష్మణరావు, రుద్రమదేవి, సురేష్, కుసుమ, భాగ్య లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

రాజమండ్రి నగరంలో స్వచ్ఛంద సేవలకు చిరునామాగా ఉంటున్న స్వర్ణాంధ్ర రాం బాబుని స్వచ్ఛంద సేవకులు సత్కరించారు. భవి ష్యత్తులో ప్రజల అవసరాలు తీర్చ డానికి అందరూ కలిసి పనిచే యాలని ఒకరికొకరు పరస్పరం సహకరించుకోవాలని సమావేశం తీర్మానించింది.

## ఓటు హక్కు వినియోగించుకున్న
# యర్రా వేణుగోపాల రాయుడు



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్:** ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల శాసనమండలి ఎన్నికల్లో భాగంగా టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి యర్రా వేణు గోపాల రాయుడు తన ఓటు హక్కు వినియో గించుకున్నారు. గురువారం స్థానిక వి ఎల్ పురం శ్యామలాంబ మున్సిపల్ కార్పొరేషన్ ఉన్నత పాఠశాలలో 69వ నెంబర్ పోలింగ్ స్టేషన్లో ఆయన ఓటు వేశారు. కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్ ఖచ్చితంగా ఎన్నికల్లో విజయం సాధిస్తారని ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్ర ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్య మంత్రి పవన్ కళ్యాణ్ సమర్థవంతమైన నాయకత్వంలో రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం వేగంగా ప్రజలకు అందించేందుకు కృషి జరుగుతుందన్నారు. ఈ శాసనమండలి ఎన్ని కల్లో కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజ శేఖర్ ను గెలిపించడం ద్వారా శాసన మండలిలో నిరుద్యోగులు, పట్టభద్రుల సమస్యలను ప్రస్తావించి, ప్రభు త్వం దృష్టికి తీసుకుని వెళ్లి పరిష్కరించేందుకు అవకాశం దక్కుతుందని పేర్కొన్నారు. ఇప్పటికే రాష్ట్రంలో పరిశ్రమలు తేవడానికి విశేష కృషి జరుగుతుందని వాటి ద్వారా ఉద్యోగ ఉపాధి అవకాశాలు మరింత మెరుగు పరిచేందుకు కూటమి ప్రభుత్వానికి వీలుంటుందని యర్రా వేణు అన్నారు. గత ప్రభుత్వం నాశనం చేసిన అన్ని వ్యవస్థలను చక్కదిద్ది పారదర్శక పాలన అందించేందుకు చేస్తున్న కృషికి పట్ట భద్రులందరూ మద్దతుగా నిలవాలని కోరారు.



## ఓటు హక్కును వినియోగించుకున్న
# జాయింట్ కలెక్టర్

రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్: రాజమహేంద్రవరం స్థానిక శ్రీ శ్యామాలంబ స్పెషల్ మునిసిపల్ స్కూల్ పోలింగ్ కేంద్రం 69లో గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటు హక్కు ను జాయింట్ కలెక్టర్ ఎస్ చిన్న రాముడు విని యోగించుకున్నారు.

## కూటమి ప్రభుత్వానికి ఓట్లు వేసినందుకు
# మా కొంపలు కూలుస్తారా?

**కొత్త తుంగపాడు గ్రామపంచాయతీ నేతల అనాలోచిత నిర్ణయానికి రోడ్డును పడ్డ మూడు కుటుంబాలు**
**గుదులకు, సచివాలయంలకు లేని అడ్డంకి నిరుపేదల ఇల్లు కు ఎందుకు వచ్చింది..?**
**పేద ప్రజల గూళ్ళు కూలిస్తే పెద్ద ఎత్తున ఉద్యమిస్తా- కాంగ్రెస్ పార్టీ జిల్లా మాజీ వైస్ ప్రెసిడెంట్ యాళ్ళ మాసరయ్య**








**రాజానగరం రూరల్ (కొత్త తుంగపాడు), విశ్వం వాయిస్ న్యూస్:** కూటమి ప్రభుత్వానికి ఓట్లేసి గెలిపించినందుకు మా కొంపలు కూలుస్తున్నారని వికలాంగులైన, నిరుపేద కుటుంబాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి. బాధితుల వివరాల ప్రకారం రాజానగరం మండలం కొత్త తుంగపాడులో గత 60 ఏళ్లుగా నివసిస్తున్న వికలాంగుడైన దొడ్డ సత్య నారాయణ, రాయుడు అన్నవరం, పిరగని నాగరత్నం లు తమ కుటుంబ సభ్యులతో గత 60 సంవత్సరాల కాలంగా నివసిస్తున్నారు. కూటమి ప్రభుత్వంలో కొత్త తుంగపాడు గ్రామానికి కమ్యూనిటీ హాల్, కళ్యాణ మండపం నిర్మాణానికి ప్రభుత్వం రూ 50 లక్షల రూపాయలు మంజూరు చేసింది . ఇది పేదల కుటుంబాల పాలిట శాపంగా మారింది. పేదల ఇల్లు కూల్చి అయిన కమిటీ హాల్ కళ్యాణ మండపం కట్టాలని కొత తుంగపాడు పంచాయతీ పెద్దలు అనధికారికంగా తీర్మానించారు. అయితే గతంలో రాజమహేంద్రవరం ఎంపీగా పనిచేసిన ఎస్.పి.బి.కే. సత్యనారాయణ హయాంలో కమ్యూనిటీ హాల్ నిర్మించారు. ప్రస్తుతం అది ఉన్నప్పటికీ ముగ్గురు పేదల ఇల్లు కూల్చి కమ్యూనిటీ హాల్, కళ్యాణమండపం కట్టేందుకు పంచాయతీ పెద్దలు నిర్ణయించారు. పంచాయతీ పెద్దల నిర్ణయంతో నిరుపేదలైన మూడు కు టుంబాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి. 60 సంవత్సరాల కాలంగా పిల్లాపాపలతో జీవించిన తాము ఎక్కడికి పోవాలని కన్నీరు మున్నేరుగా విలపిస్తున్నారు. గత 60 సంవత్సరాల కాలంలో ఇంటి పన్ను, కరెంటు బిల్లు తదితర పంచాయతీ పనులు చెల్లిస్తున్నామని వృద్ధాప్యంలో ఉన్న తమకు ఉన్నపలంగా వెళ్లి పొమ్మంటే ఎక్కడ పోవాలని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చెరువు గట్టుపై ఉన్న ఆంజనేయ స్వామి గుడి, శివాలయం, సచివాలయం లకు లేని అడ్డంకి నిరుపేదల ఇళ్ళు కు ఎందుకు అడ్డం వచ్చిందని గ్రామ ప్రజలు ప్రశ్నిస్తున్నారు. దొడ్డికాంతం మాట్లాడుతూ వికలాంగుడిన తన భర్త గత 60 సంవత్సరాల కాలంగా చెవురుగట్టుపై సైకిళ్లకు ప్యాచీలు వేసి జీవనం సాగిస్తున్నామని అయితే గ్రామపంచాయతీ నేతలు తమను పిలిచి వెంటనే ఇల్లు ఖాళీ చేయాలని హుకుం జారీ చేశారని తెలిపారు. వృద్ధాప్యంలో ఉండి వికలాంగుడి అయిన తన భర్తతో ఎక్కడికి పోవాలని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామపంచాయతీ నేతలు విజ్ఞతతో ఆలోచించి కళ్యాణ మండపాన్ని వేరేచోట నిర్మించి, తమకు గూడు ప్రసాదించాలని వేడుకున్నారు.

**నిరుపేదల ఇళ్ళ తరలిస్తే ఉద్యమిస్తాం :**

నిరుపేదలైన బడుగు బలహీన వర్గాలు, గిరిజన కుటుంబాలకు చెందిన మూడు కుటుంబాలను వేరే చోటికి తరలిపోవాలని కొత్త తుంగపాడు గ్రామపంచాయతీ నేతలు నిర్ణయించడం దురదృష్టకరమని కాంగ్రెస్ పార్టీ జిల్లా మాజీ వైస్ ప్రెసిడెంట్ యాళ్ల మాసరయ్య పేర్కొన్నారు. 60 ఏళ్లు కాలంగా ఇల్లు నిర్మించుకొని జీవిస్తున్న కుటుంబాలు ఎక్కడికి పోతాయని ప్రశ్నించారు. ఇప్పటికైనా పంచాయతీ పెద్దలు కమ్యూనిటీ హాల్, కళ్యాణ మండపాన్ని వేరే ప్రాంతం లో స్థలం సేకరించి నిర్మించాలని కోరారు. నిరుపేదల ఇల్లు కూల్చిస్తామంటే సహించేది లేదని, ప్రజా సంఘాలతో ఉద్యమిస్తామని హెచ్చరించారు.

# మహాశివరాత్రిలో భక్తులకు ఎన్.ఎస్.ఎస్ సేవలు భేష్







**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్:** రాజమహేంద్రి మహిళా కళాశాల ఎన్.ఎస్.ఎస్ విద్యార్థులు ఆధ్వర్యంలో మహాశివరాత్రి పర్వది నాన్ని పురస్కరించుకొని ఘాట్ల వద్ద పుణ్య స్నానాలు అచరించే భక్తులకు ఎన్ ఎస్ ఎస్ పి.ఓ డి.వీరవెంకటరావు పర్యవేక్షణలో కాల భైరవ స్వామి దేవాలయంలో మజ్జిగ, పులిహోర, మం చినీళ్ళ ప్యాకెట్స్ అందిం చారు. ఈ కార్యక్రమంలో సేవలు చేస్తున్న ఎన్ ఎస్ ఎస్ యూనిట్ విద్యా ర్థులను పలువురు అభి నందించారు.

ఈ కార్యక్ర మంలో ప్రిన్సిపాల్ ఎం.కే.ఎస్. ప్రసాద్, ఎన్.ఎస్.ఎస్ విద్యార్థులు పాల్గొన్నారు.



## సంగాం శివాలయానికి రెండో రోజు భక్తులు తాకిడి

**వంగర, విశ్వం వాయిస్ న్యూస్ :** పూర్వం బలరాం స్వామిప్రతిష్టించిన పంచలింగాలలో ఒకటైన శ్రీ సంగం సంగమేశ్వర స్వామి ఆలయము రెండవ రోజు కూడా భక్తులు పెద్ద మొత్తంలో స్వామివారి దర్శించుకున్నారు. దూరపులంతా నుండి వచ్చే భక్తులు బుధవారం శివరాత్రి జాగరాలను చేసి వేకువ జాము నుండినుండి త్రివేణి నదీ స్నానాలు ఆచరించి భక్తిశ్రద్ధలతో స్వామివారిని భక్తులు దర్శించుకుని ప్రత్యేక అభిషేకాలు చేశారు.

## నరసరావుపేట ఎమ్మెల్సీ ఎన్నికలలో రొంపిచర్ల మండలం పోలింగ్ బూత్ పరిశీలన



**నరసరావుపేట, విశ్వం వాయిస్ న్యూస్** నరసరావుపేట ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో రొంపిచర్ల మండలంలోని పోలింగ్ బూత్‌ను ఎమ్మెల్యేలు మరియు పార్టీ నాయకులు పరిశీలించారు. పోలింగ్ ప్రక్రియ సజావుగా సాగేందుకు అవసరమైన ఏర్పాట్లను పర్యవేక్షించి, అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా నాయకులు ఓటింగ్ ప్రక్రియపై దిశానిర్దేశం చేస్తూ, ప్రజలు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించిన అంశాలను సమీక్షించి, అవసరమైన మార్గదర్శకాలను అధికారులకు ఇచ్చారు. పార్టీ నేతలు, కార్యకర్తలు, స్థానిక ప్రజాప్రతినిధులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



### అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్‌కు

# పంపు సెట్టు బహూకరణ





**- డా.హిప్నో పద్మా కమలాకర్, సతీష్**

**హైదరాబాద్, విశ్వం వాయిస్ న్యూస్**

ప్రపంచ ఎన్జిఓ డే ఫిబ్రవరి 27ను పురస్కరించుకొని, డా. హిప్నో కమలాకర్స్ మైండ్ అండ్ పర్సనాలిటీ కేర్ అండ్ నవభారత లయన్స్ క్లబ్ తరపున ముషిరాబాద్‌లో ఉన్న అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ (యూపీహెచ్సిసి) కి వాటర్ మోటార్‌ను బహూకరణ చేయడం జరిగింది. హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ జాతీయ చైర్మన్ "డా. కొప్పుల విజయ్ కుమార్" పంపు సెట్టు వితరణ చేయగా డా.హిప్నో పద్మా కమలాకర్, హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ తెలంగాణ అధ్యక్షుడు సతీష్,డా. ఎం. మనోజ్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రెసివ్ సైకాలజిస్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా అధ్యక్షురాలు డా. పద్మా కమలాకర్ మాట్లాడుతూ, "ఆరోగ్య కేంద్రాల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధి అత్యవసరమన్నారు. మంచినీటి సరఫరా సరైన విధంగా ఉండటం అక్కడ సేవలు అందుకునే రోగు లకు, వైద్య సిబ్బందికి ఎంతో అవసరమని తెలిపారు. ఈ దానంతో మా తరపున ఒక చిన్న సహాయాన్ని అందించగలి గినందుకు సంతోషంగా ఉంది" అన్నారు. వితరణ చేసిన కె.విజయ్ కుమార్ కి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్ర మంలో హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ తెలంగాణ అధ్యక్షుడు సతీష్, జి.కృష్ణవేణి, జ్యోతి రాజా, లయన్ జయశ్రీ,ముషీరాబాద్ యూపీహెచ్సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఎం మనోజ్ రెడ్డి, ఏఎన్ఎంలు విజయ కుమారి, సునీత, పద్మలత, ల్యాబ్ టెక్నీషియన్ రత్నమాల, ఆశా కార్యకర్తలు రేణుక రమ్య సరిత, కృష్ణవేణి ఆరోగ్య కేంద్ర సిబ్బంది, ఇతర అతిథులు పాల్గొన్నారు. వారు డా. పద్మా కమలాకర్ చేపడుతున్న సేవా కార్యక్రమాలను ప్రశంసించారు.

# ఎస్సీ కమ్యూనిటీ హాల్ ఊసే మరిచిన ప్రజాప్రతినిధులు, అధికారులు

**- మాలమహానాడు భద్రాద్రి జిల్లా ప్రధాన కార్యదర్శి అల్లాడి పౌల్ రాజ్**



**ఎటపాక / భద్రాచలం, విశ్వం వాయిస్ న్యూస్ :** పట్టణంలో నిర్మాణంలో ఉన్న ఎస్సీ కమ్యూనిటీ హాల్ ను పూర్తి చేయడంలో ప్రజాప్రతినిధులు , అధికారులు ఊసే మరిచారని మాలమహానాడు భద్రాద్రి జిల్లా ప్రధాన కార్యదర్శి అల్లాడి పౌల్ రాజ్ ఎద్దేవా చేశారు. స్థానిక అయ్యప్ప కాలనీ నందు మాలమహానాడు ముఖ్య కార్యకర్తల సమావేశం గురువారం మాలమహానాడు పట్టణ అధ్యక్షులు దేగల శివ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమా వేశానికి మాలమహానాడు జిల్లా ప్రధాన కార్యదర్శి అల్లాడి పౌల్ రాజ్ హాజరై మాట్లాడుతూ భారత దేశానికి స్వతంత్రం వచ్చి 75 ఏళ్లు అవుతున్నా భద్రాచల నియోజకవర్గంలో ఉన్న ఎస్సీలకు పూర్తి స్వాతంత్రం రాలేదని , ప్రభుత్వ అధికారులు , ప్రజాప్రతినిధులు భద్రాచల నియోజకవర్గంలో జీవిస్తున్న ఎస్సీల పట్ల వివక్షత చూపిస్తున్నారని పేర్కొన్నారు. భద్రాచల పట్టణంలో ఎస్సీ కమ్యూనిటీ హాల్ నిర్మాణంలో అధికారుల పనితీరుపై అనుమానాలు కలిగిస్తున్నాయని , పదేళ్లు గడుస్తున్న ఇప్పటివరకు ఎస్సీ కమ్యూనిటీ హాల్ పూర్తి కాకపోవడం ఎస్సీల సామాజిక అంశానికి భంగం కలిగేలా ఉందన్నారు. భద్రాచలంలో నిర్మిస్తున్న ఎస్సీ కమ్యూనిటీ హాల్ పనితీరుపై స్థానిక ఎంపీ , ఎమ్మెల్యే , ప్రభుత్వ ఉన్నత అధికారులు స్పందించి కమ్యూనిటీ హాల్ నిర్మాణంలో తమ వంతు పాత్ర పోషించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో మాలమహానాడు ఆధ్వర్యంలో దశల వారి పోరాటం చేస్తామని హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో శాంతి రాజు , సామేలు, వంశీ, శివ, రామకృష్ణ నాని , చీకటి దశమ్ బాబు, శీను, మురికి శీను , తదితరులు పాల్గొన్నారు.

### కామ్రేడ్ రవన్న 9వ వర్ధంతి సభను

# జయప్రదం చేయండి

**భద్రాచలంలో రాష్ట్ర సభ పోస్టర్ ఆవిష్కరణ - సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ నాయకుల చేతుల మీదుగా**

**ఎటపాక / భద్రాచలం, విశ్వం వాయిస్ న్యూస్ :** కామ్రేడ్ రవన్న రాయల సుభాష్ చంద్రబోస్ 9వ వర్ధంతి రాష్ట్ర సభ మార్చి 9న ఖమ్మంలోని సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ కార్యాలయంలో పార్టీ, రవన్న ట్రస్ట్ ఆధ్వర్యంలో జరుగుతుందని సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ రాష్ట్ర నాయకులు కె.రంగారెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇందులో పలువురు మేధావులు, పార్టీ నాయకులు పాల్గొని పలు అంశాలపై ప్రసంగించనున్నట్టు తెలిపారు. జిల్లా , డివిజన్ ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ రాష్ట్ర నాయకులు కె రంగారెడ్డి విజ్ఞప్తి చేశారు. సభ ప్రచార నిమిత్తం ప్రచురించిన పోస్టర్ ను భద్రాచలంలోని మాస్ లైన్ పార్టీ కార్యాలయంలో నాయకుల చేతుల మీదుగా ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ కామ్రేడ్ రవన్న విద్యార్థి దశ నుండి 1969లో డిగ్రీ చదువుని వదిలేసి విప్లవ ఉద్యమంలో పని చేశారు. క్రమశిక్షణ గల ఆదర్శవంతమైన కమ్యూనిస్టు నాయకుడిగా పనిచేస్తూ 2016 మార్చి 9న మరణించారు. ఆయన భారతదేశంలో మారుతున్న ఆర్థిక రాజకీయ సామాజిక మార్పులకు తగిన విధంగా పంథా ఉండాలని భావించిన నాయకుడు రవన్న పిరికివాడు కాదు మార్క్సిజం సృజనాత్మకమైనదని నమ్మినవాడు. అలాంటి నాయకుడు నేడు లేకుండా విప్లవ ఉద్యమానికి తీరని లోటు అని , ఆటువంటి లోటును అధిగమిద్దాం తను చూపిన నేటి మాస్ లైన్ పందాలు పురోగమిద్దాం ఇంతట ప్రాధాన్యత గల సభలో పాల్గొని విజయవంతం చేయాలని నాయకులు ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకురాలు కె కల్పన, డివిజన్ నాయకులు దాసరి సాయి, మునిగేలా శివ ప్రశాంత్, భాస్కర్ అన్న, భీమరాజు దేవ, ఉదయ, చుక్కయ్య, ముఖేష్, సుజాత , సరళ , మహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.




### ఏజెన్సీలో ప్రశాంతంగా ముగిసిన

# పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు

**పోలింగ్ ను పర్యవేక్షించిన టిడిపి అరకు పార్లమెంట్ కార్యదర్శి మువ్వ టిడిపి జిల్లా సీనియర్ నాయకులు డా.జమాల్ ఖాన**





**ఎటపాక , విశ్వం వాయిస్ న్యూస్ :** తూర్పు ఏజెన్సీ ప్రాంతమైన చింతూరు డివిజన్ లో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు గురువారం ప్రశాంతంగా ముగిశాయి. డివిజన్ పరిధిలోని నాలుగు (ఎటపాక, కూనవరం, విఆర్.పురం, చింతూరు) మండలాల్లో మొత్తం 1560 మంది పట్టభద్రుల ఓటర్లు ఉండగా 1230 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. అందులో 824 మంది పురుషులు, 406 మంది స్త్రీలు ఉన్నారు. సాయంత్రం పోలింగ్ ముగిసే సమయానికి మొత్తంగా 78.85 శాతం పోలింగ్ నమోదైంది. కాగా చింతూరు, ఎటపాక, కూనవరం, విఆర్.పురం మండలాల్లో ఉమ్మడి గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న పేరాబత్తుల రాజశేఖర్ గెలుపు కోరుతూ కూటమి శ్రేణులు, నాయకులు ఆయా పోలింగ్ కేంద్రాల వద్ద పోలింగ్ సరళిని పర్యవేక్షించారు.

ఎటపాక, చింతూరు మండలాల్లోని పోలింగ్ కేంద్రాల వద్ద టిడిపి అరకు పార్లమెంటు కార్యదర్శి మువ్వా శ్రీనివాస్, టిడిపి సీనియర్ జిల్లా నాయకులు, ప్రముఖ ఆయుర్వేద వైద్యులు డాక్టర్ జమాల్ ఖాన్ పోలింగ్ జరుగుతున్న తీరును, ఎన్నికల ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా తమ పార్టీకి చెందిన బూత్ ఏజెంట్లకు పలు సూచనలు చేశారు.

ఈ సందర్భంగా టిడిపి మండల అధ్యక్షులు పుట్టి రమేష్ బాబు, టిడిపి నాయకులు అనుగోజు మురళి, మువ్వ రాము, పసుపులేటి రాంబాబు, దాడి ప్రవీణ్, వీర్రాజు, తదితరులు ఉన్నారు.




### సంక్షేమ పథకాల వల్లే

# కార్మికులు పని చేయట్లేదు



'భార్యను ఎంతసేపు చూస్తూ ఉండిపోతారు.. ఆదివారాలూ పనిచే యండి' అంటూ ఇటీవల వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన ఎల్ అండ్ టీ ఛైర్మన్ ఎస్.ఎన్. సుబ్రహ్మణ్యన్ మరోసారి వార్తల్లో నిలిచారు. నిర్మాణ రంగంలో కార్మికుల వలసలు తగ్గిపోవడంపై ఆందోళన వ్యక్తంచేసిన ఆయన.. సంక్షేమ పథకాల అమలు కారణంగానే ఈ పరిస్థితి తలెత్తిందన్నారు. వాటివల్లే కార్మికులు పని చేయడానికి ఇష్ట పడటం లేదన్నారు. చెన్నైలో జరిగిన భారత పరిశ్రమల సమాఖ్య సదస్సులో పాల్గొన్న ఆయన కార్మికుల కొరత అంశాన్ని ప్రస్తావిం చారు. "మా సంస్థలో ప్రస్తుతం 2.5 లక్షల మంది ఉద్యోగులు, 4 లక్షల మంది కార్మికులు ఉపాధి పొందుతున్నారు. ఉద్యోగుల సంఖ్య లో తగ్గుదల ఉన్నప్పటికీ ఆ విషయం పెద్దగా బాధించట్లేదు. కానీ, కార్మికుల లభ్యత గురించి నేను ఎక్కువగా ఆందోళన చెందుతున్నా. ఈ రోజుల్లో కార్మికులు అవకాశాల కోసం వేరే ప్రాంతానికి వలస వెళ్లేందుకు ఇష్టపడట్లేదు. బహుశా స్థానికంగా వారికి సంపాదన బాగానే ఉండొచ్చు. ఇక, అందుబాటులో ఉన్న ప్రభుత్వ సంక్షేమ పథకాలు కూడా కారణం కావొచ్చు. వాటివల్లే వారు వేరే ప్రాంతాల కు వెళ్లి పనిచేయడానికి ఆసక్తి చూపించట్లేదు" అని సుబ్రహ్మణ్యన్ వ్యాఖ్యానించారు. "అయితే, కేవలం కార్మికుల్లో మాత్రమే కాదు.. వైట్ కాలర్ ఉద్యోగాలు చేస్తున్న వృత్తి నిపుణుల్లోనూ ఇదే భావన ఉందనిపిస్తోంది. నేను ఎల్ అండ్ టీ సంస్థలో ఇంజినీర్‌గా చేరిన ప్పుడు మా బాస్ దిల్లీలో ఉద్యోగం చేయాల్సిఉంటుందని చెప్పారు. కానీ, ఈ రోజుల్లో ఎవరైనా వ్యక్తిని అలా అడిగితే.. 'బై' అంటూ వెళ్లి పోతున్నారు" అని వివరించారు. ప్రస్తుతం ఆయన వ్యాఖ్యలు నెట్టిం ట వైరల్‌గా మారాయి. ఆ మధ్య వర్క్‌లైఫ్ బ్యాలెన్స్‌పై సుబ్ర హ్మణ్యన్ చేసిన వ్యాఖ్యలు తీవ్ర చర్చనీయాంశమైన సంగతి తెలిసిందే. "ఇంట్లో కూర్చుని ఏం చేస్తారు. ఎంతకాలం అలా భార్యను చూస్తూ ఉండిపోతారు. ఇంట్లో తక్కువ సమయం, ఆఫీసులో ఎక్కువ సమ యం ఉంటామని భార్యలకు చెప్పాలి. వారానికి 90 గంటల పాటు పనిచేయాలి. ఆదివారం సెలవునూ వదిలేయాలి" అని ఆయన చేసిన వ్యాఖ్యలు ఆన్‌లైన్‌లో పెను దుమారం లేపాయి. దీనిపై ఆ తర్వాత కంపెనీ స్పష్టతనిచ్చింది. అభివృద్ధి చెందిన దేశంగా ఎదిగే క్రమంలో అసాధారణ లక్ష్యాలను చేరాలంటే అసాధారణ కృషి అవసరం అంటూ తన ఛైర్మన్ వ్యాఖ్యలను సమర్థించింది.

### ఉత్సాహభరితంగా మహాకుంభమేళ

# ముగింపు ఉత్సవాలు

**- లయన్స్ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ ఆధ్వర్యంలో పూర్ణాహుతితో శివనామ స్మరణ**

**శ్రీకాకుళం, విశ్వం వాయిస్ న్యూస్**



శ్రీకాకుళం మహా కుంభమేళ ముగింపు ఉత్సవాలు నేటితో ముగిశాయని, బ్రహ్మ శ్రీ భాస్కరబట్ల శ్రీ రామ శర్మ గురువారం తెలిపారు. లయన్స్ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ జోన్ చైర్మన్ పొన్నాడ. రవి కుమార్, మెంటార్ నటుకుల మోహన్, జోన్ చైర్మన్ పొన్నాడ రవి కుమార్ ఇతర సభ్యుల సహకారంతో గత వారం రోజులనుండి కుంభమేళా ముగింపు ఉత్సవాల పర్యవేక్షణలతో వైభవంగా జరిగాయన్నారు. ఈ రోజు మహా లింగోద్భవం ప్రత్యేక దర్శనం, తెల్లవారు ఝామున బ్రాహ్మీకాలార్చన, మహా పూర్ణాహుతి తో మహాశివుని దర్శనం కనువింపు చేసిందని, ఈ దైవ కార్యాన్ని ఆ పరమశివుడు దగ్గరుండి చేయించినట్లేనని తెలిపారు. లైన్స్ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ సభ్యులు మాట్లాడుతూ నాగావళీ నదీ గర్భం, ఉమారుద్ర కోటీశ్వర ఘాట్ వేదికగా భారతీయ సంస్కృతి సంప్రదాయాలను అనుసరించి మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా నాగావళి నదీ గర్భంలో విశేష కార్యక్రమాలు జరగటం ఆనందంగా ఉందని, బ్రహ్మ శ్రీ భాస్కరబట్ల శ్రీ రామ శర్మ గురువుగారు ఆధ్వర్యంలో బ్రాహ్మీకాలం నుండి సుప్రభాత సేవ, బ్రాహ్మీకాల అభిషేకము అర్చనలు, యోగా సాధకులచే యోగ నిరూపణం, సామూహిక అభిషేకములు, హవనములు, అర్చన, అభిషేకం జరిగాయని, ఆరడుగుల లింగదర్శన ప్రత్యేక పూజలు అనంతరం 108 విగ్రహాలును నదీగర్భంలో నిమగ్నం చేశామన్నారు. ఈ కార్యక్రమం అందరి సహకారంతో జరిగిందని, ఇందులో భాగమైన ప్రతీ ఒక్కరికీ ధన్యవాదాలన్నారు. ఇంతటి మహోత్తర కార్యక్రమం మన జిల్లాలో, అది కూడా శ్రీకాకుళం పట్టణం లో జరగటం కుంభమేళాను దగ్గరుండి తిలకించే భాగ్యాన్ని కలిగించారని, భక్తులు నగర పరిసర ప్రాంతాలనుండి కాకుండా, ఇతరప్రాంత ప్రజలు కూడా పాల్గొన్నారన్నారు.

### 2025లో ప్రకటనల ఆదాయం

# రూ.1.64 లక్షల కోట్లు




ఈ ఏడాది భారత మీడియా విభాగాల ప్రకటనల ఆదాయ వృద్ధి 7 శాతానికి తగ్గవచ్చని ప్రముఖ మీడియా ఏజెన్సీ గ్రూప్‌ఎం అంచనా వేసింది. 2024లో ఈ వృద్ధి 8.8 శాతంగా నమోదైందని రిపోర్టు లో పేర్కొంది. 2025లో దేశంలోని అన్ని మీడియా విభాగాలకు ప్రకటనల ద్వారా మొత్తం రూ.1,64,137 కోట్ల ఆదాయం సమ కూరవచ్చని గ్రూప్‌ఎం అంటోంది. 2024లో నమోదైన రూ.1,53, 407 కోట్ల ఆదాయంతో పోలిస్తే ఇది 7 శాతం అధికం. ప్రపంచం లోని అతిపెద్ద అడ్వర్టైజ్‌మెంట్ మార్కెట్లలో భారత్ 9వ స్థానంలో ఉండగా.. అమెరికా, చైనా, యునైటెడ్ కింగ్‌డమ్(యూకే) టాప్-3 స్థానాల్లో ఉన్నాయి. ప్రపంచవ్యాప్తంగా యాడ్ రెవెన్యూ వృద్ధి ఈ ఏడాదిలో 7.7 శాతానికి పరిమితం కానుంది. 2024లో ఇది 9.5 శాతంగా నమోదైంది. భారత్‌లో డిజిటల్ ప్రకటనల ఆదాయం వే గంగా పెరుగుతోంది. ఈ ఏడాది డిజిటల్ యాడ్ రెవెన్యూ వార్షిక ప్రాతిపదికన 11.5% వృద్ధితో రూ.లక్ష కోట్లకు చేరుకోవచ్చని అంచనా. దేశంలో మొత్తం ప్రకటనల ఖర్చులో 60 శాతం వాటా డిజిటల్ యాడ్స్‌దే. ప్రపంచవ్యాప్తంగా ఈ వాటా 82 శాతంగా ఉంది. టీవీ ప్రకటనల ఆదాయం ఈ ఏడాదిలో 1 శాతం తగ్గి రూ. 42,431 కోట్లకు పరిమితం కావచ్చని అంచనా. 2024లో ఈ విభాగ ప్రకటనల రెవెన్యూ రూ.42,859 కోట్లుగా నమోదైంది. టీవీ యాడ్ రెవెన్యూలో 12.6 శాతం వాటా స్ట్రీమింగ్ టీవీలదే. 2025లో పత్రికల ప్రకటనల ఆదాయం 4 శాతం పెరిగి రూ.15, 947 కోట్లుగా నమోదుకావచ్చని అంచనా. మొత్తం ప్రకటనల ఆదాయంలో ఈ విభాగ వాటా 10 శాతంగా ఉండనుంది.

# ఆదాయ పన్ను రిటర్నుల్లో చెల్లింపులు నిల్లు

ఆదాయం పన్ను (ఐటీ) రిటర్న్లు సమర్పించే వారిలో మూడింట రెం డొంతుల మంది చెల్లించిన పన్ను సున్నా అని కేంద్రం వెల్లడించింది. వీరి సంఖ్య 2019-20 ఆర్థికతో పోలిస్తే 2024-25 ఆర్థిక సంవత్సరం నాటికి దాదాపు రెట్టింపైంది. లోక్‌సభలో పన్ను చెల్లింపుదారులపై అడిగిన ప్రశ్నకు కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి లిఖిత పూర్వకంగా ఈ విషయా న్ని వెల్లడించారు. మంత్రి సమర్పించిన డేటా ప్రకారం.. 2019-20లో 6.48 కోట్ల మం ది ఐటీ రిటర్న్లు సమ ర్పించగా.. అం దులో సున్నా పన్ను బకాయితో దాఖలైన రిటర్నులు 2.9 కోట్లు. అంటే మొత్తం రిటర్న్లల్లో 44.75 శాతానికి సమానం. కాగా, 2024-25 ఆర్థిక సంవత్సరంలో డిసెంబరు 31 నాటికి 8.39 కోట్ల మంది రిటర్న్లు ఫైల్ చేశారు.



## శ్రద్ధాదాస్ వస్త్రధారణలో గ్లామర్ యొక్క విజన్

శ్రద్ధా దాస్ 2025ని స్టైల్‌గా స్వాగతించింది. ఆమె తన తాజా ఇన్‌స్టాగ్రామ్ పోస్ట్‌తో అందరినీ పిచ్చెక్కించేలా చేసింది. ఫోటోలో, ఆమె ఎండలో సరదాగా గడుపుతూ తన ఫ్యాషన్ సెన్స్‌ను చిత్రీకరించింది. శ్రద్ధాదాస్ ఆరు చలనచిత్ర పరిశ్రమలలో పనిచేసిన నైపుణ్యం కలిగిన నటి. ఆమె 2008లో సిద్దూ ఫ్రమ్ శ్రీకాకుళం సినిమాతో తన నటనా జీవితాన్ని ప్రారంభించింది. ఈ రొమాంటిక్ కామెడీలో ఆమె పాత్ర ప్రేక్షకులను మరియు విమర్శకులను ఆకట్టుకుంది. ఈ విజయం తరువాత, ఆమె తదుపరి సంవత్సరంలోనే మరో ఐదు చిత్రాలకు సంతకం చేసింది. ఒక ప్రముఖ చిత్రం అల్లు అర్జున్ నటించిన ఆర్య 2. దీంతో ఆమెకు పరిశ్రమలో మరింత గుర్తింపు వచ్చింది. సిద్దూ ఫ్రమ్ శ్రీకాకుళం ఒక తెలుగు భాషా చిత్రం, ఇది ఆగష్టు 14, 2008న విడుదలైంది. ఈశ్వర్ చిత్రానికి రచన మరియు దర్శకత్వం వహించారు. వెల్ఫేర్ క్రియేషన్స్ బ్యానర్‌పై మళ్ల విజయప్రసాద్ నిర్మిం చారు. ఈ చిత్రంలో శ్రద్ధాదాస్‌తో పాటు అల్లరి నరేష్ మరియు మంజరి ఫడ్నీస్ నటిస్తున్నారు. ఆమె ఇటీవలి ఇన్‌స్టాగ్రామ్ పోస్ట్‌లో, శ్రద్ధా స్టైలిష్ స్విమ్‌సూట్‌లో తన సమయాన్ని ఆస్వాదిస్తూ కనిపిం చింది. ఈ పోస్ట్ వేల సంఖ్యలో లైక్‌లు మరియు వ్యాఖ్యలతో దృష్టిని ఆకర్షించింది. ఈ పిక్‌తో శ్రద్ధా దాస్ ఒకప్పుడు తనలోని అత్యంత స్టైలిష్ పార్శ్వాన్ని చాలా ఫ్యాషనబుల్‌గా చూపించింది.

## రాయ్‌లక్ష్మి ఆధునికత



రాయ్ లక్ష్మి స్టైల్ డైరీ చక్కదనం మరియు ఆధునికత యొక్క మిశ్రమాన్ని ప్రదర్శిస్తుంది. ఆమె పంచుకునే ప్రతి లుక్ చాలా మంది ఫ్యాషన్ ప్రియులను ప్రేరేపిస్తుంది. రాయ్ లక్ష్మి మే 5, 1989న భారతదేశంలోని బెంగ ళూరులో జన్మించారు. ఆమె ఒక భారతీయ సినీ నటి మరియు మోడల్. ఆమె ఎక్కువగా దక్షిణ భారత చిత్రాలలో పని చేస్తుంది. ఆమె తమిళ చిత్రాలలో నటించిన తర్వాత ఆమె కెరీర్ ఊపందుకుంది. 2008లో ధామ్ ధూమ్ చిత్రంలో తన నటనతో రాయ్ దృష్టిని ఆకర్షించింది. ఆమె న్యాయవాదిగా నటించింది మరియు ఉత్తమ సహాయ నటిగా ఫిల్మ్‌ఫేర్ అవార్డు నామినేషన్‌ను పొందింది. ఆమె పురోగతి తర్వాత, రాయ్ వివిధ మలయాళ చిత్రాలలో నటించింది. నేడు, ఆమెను మాలీవుడ్ తిరుగులేని రాణిగా పరిగణిస్తారు. ఆమె విజయవంతమైన చిత్రాలలో ఇరుం బు కొట్టై మురట్టు సింగం, కాంచన, మంగథ మరియు అరణ్మనై ఉన్నాయి. ఈ చిత్రాలన్నీ పరిశ్రమలో ఆమె హోదాను పదిలం చేసుకోవ డానికి సహాయపడ్డాయి. రాయ్ లక్ష్మి కేవలం నటి మాత్రమే కాదు. ఆమె ఫ్యాషన్ ఐకాన్ కూడా. ఆమె ఇన్‌స్టాగ్రామ్ ఆమె శైలిని ప్రదర్శించే శక్తివంతమైన చిత్రా లతో నిండి ఉంది. ఆమె ఇటీవలి పోస్ట్ లలో ఒకటి ఆమె పూల రెండు ముక్క ల దుస్తులలో కనిపిస్తుంది. ఆమె స్టైలిష్ యాక్సె సరీలు మరియు చిక్ సన్ గ్లాసెస్ తో లుక్ ని పూర్తి చేసింది. ఈ చిత్రం యొక్క శీర్షిక "మ నం ఒకే ఆకాశం కింద విభిన్న కథలతో ఉన్నా ము" అని చెబుతూ కనెక్షన్ యొక్క భావాన్ని తెలియ జేస్తుంది. ఈ ఆకర్షణీయ మైన చిత్రాలు ఆమె పూల దుస్తుల రాణి అని నిరూపించాయి.

## హాలీవుడ్ రేంజ్‌లో ఎన్టీఆర్ క్రేజ్



జూనియర్ ఎన్టీఆర్ తన అద్భుతమైన నటనతో స్టైల్‌తో దేశవ్యాప్తంగా కాకుండా ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందు తున్నాడు. 'ఆర్ఆర్ఆర్' సినిమా విడుదల తర్వాత ఎన్టీఆర్‌కు ఉన్న క్రేజ్ మరింతగా పెరిగింది. ముఖ్యంగా ఇంటర్వెల్ యాక్షన్ సీక్వెన్స్‌లు, రామ్ చరణ్‌తో కలిసిన సన్నివేశాలు, యాక్షన్ బ్లాక్స్ ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల హృదయాలను గెలుచుకున్నాయి. ఈ సీన్స్ ఎన్టీఆర్‌కు హాలీవుడ్ రేంజ్ లో క్రేజ్ తీసుకు వచ్చాయని మరోసారి క్లారిటీ వచ్చేసింది. హాలీవుడ్ లో టాప్ డైరెక్టర్లో ఒకరైన మరో దర్శకుడు ఎన్టీఆర్ తో వర్క్ చేయాలని ఉన్నట్లు తన కోరికను ఓపెన్ గా చెప్పేశాడు. ఆర్ఆర్ఆర్ సినిమా వల్ల ఎన్టీఆర్ పాన్ వరల్డ్ స్టార్‌గా ఎదిగారు. రాజమౌళి తెరకెక్కించిన ఈ ప్రతిష్ఠాత్మక చిత్రం ప్రపంచవ్యాప్తంగా భారీ స్థాయిలో విజయవంతమయ్యింది. ముఖ్యంగా హాలీవుడ్ సినీ ప్రపంచంలో కూడా ఈ సినిమా ప్రభావం విస్తరించింది. ఏకంగా ఎన్టీఆర్‌ని 'టైగర్' అనే పేరు పెట్టి పొగిడిన ప్రఖ్యాత సినీ తారలు, దర్శకులు, నిర్మాతలు ఉన్నారు. ముఖ్యంగా యాక్షన్ సీన్స్‌లో తారక్ ప్రదర్శనకు ఎమోషనల్ కంటెంట్‌లో ఉన్న ఇంపాక్ట్‌కు దాసోహమయ్యారు. ఇప్పుడు హాలీవుడ్ డైరెక్టర్ జేమ్స్ గన్ కూడా ఎన్టీఆర్‌పై ప్రశంసల వర్షం కురిపించారు. ఇది తెలుగు సినీ ప్రపంచానికి గర్వకారణంగా నిలిచింది. జేమ్స్ గన్ మాట్లాడుతూ, "నాకు ఎన్టీఆర్‌తో సినిమా చేయాలని చాలా ఆసక్తిగా ఉంది. 'ఆర్ఆర్ఆర్' లోని యాక్షన్ సీన్స్, ఎన్టీఆర్ నటన నా దృష్టిని విశేషంగా ఆకర్షించాయి. జంతువులతో దుకే సీన్ అద్భుతంగా ఉంది. అందులో అతను అద్భుతంగా కనిపించాడు. ఒక గొప్ప ప్రాజెక్టులో ఆయనతో పని చేయాలని కోరు కుంటున్నాను," అని జేమ్స్ చెప్పడం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. జేమ్స్ గన్ గతంలో 'గార్డియన్స్ ఆఫ్ ది గెలాక్సీ,' 'ది స్యూసైడ్ స్క్వాడ్' వంటి బ్లాక్‌బస్టర్ సినిమాలకు దర్శకత్వం వహించారు. ప్రస్తుతం ఆయన 'సూపర్ మ్యాన్' అనే సినిమాను విడుదలకు సిద్ధం చేస్తున్నారు. ఈ సినిమాపై మంచి అంచనాలు ఉన్నాయి. ఇక హాలీవుడ్ లో తనదైన ముద్రవేసిన ఆయన ఎన్టీఆర్ తో పని చేయాలని వ్యక్తపరచడం తెలుగులో హిట్ హీరోల స్థాయిని అంతర్జాతీయంగా మరింత పెంచినట్టే. ఈ మధ్య కాలంలో హాలీవుడ్ నుండి వచ్చే ప్రతి ప్రశంస ఎన్టీఆర్ స్థాయిని మరింతగా పెంచుతోంది. టాలీవుడ్ హీరోలు పాన్ ఇండియా మాత్రమే కాకుండా పాన్ వరల్డ్ స్థాయిలో గుర్తింపు తెచ్చుకుంటున్నారు.

## ఎడిన్ రోజ్‌కు ప్రశంసలు



ఎడిన్ రోజ్ సినిమా ఇండస్ట్రీలో చెప్పుకోదగ్గ హీరోయిన్లలో ఒకరు. ఈ నటి గ్లామర్ రంగంలో అద్భుతంగా రాణిస్తోంది. ఆమె మొదట రావణాసుర చిత్రంలో కనిపించింది. ఆలస్యంగా తమిళంలో కొన్ని ఆసక్తికరమైన సినిమాలు చేసింది. ఆమె తెలుగు మాట్లాడే అమ్మాయి కానప్పటికీ, ఈ నటికి మొదట తెలుగు చిత్ర పరిశ్రమలో అవకాశాలు వచ్చాయి. ఎడిన్ రోజ్ లవ్ ఇన్సూరెన్స్ కంపెనీ అనే తమిళ చిత్రం ఎల్ఐకె కూడా చేసారు. వైల్డ్ కార్డ్ కంటెస్టెంట్‌గా చేరిన నటి నవంబర్ 2023 లో "బిగ్ బాస్ 18" చేసింది. ఆమె నటనకు అందరి నుండి భారీ ప్రశంసలు లభించాయి. ఎడిన్ సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉంటారు మరియు ఆమె ఇటీవల ఆసక్తికర మైన ఫోటోలను షేర్ చేసింది. తాజా ఫోటోలలో, నటి వన్ పీస్ డ్రెస్‌లో అందంగా కనిపించింది. వదులైన జుట్టుతో, ఆమె అద్భుతమైన దుస్తులలో కనిపిస్తుంది. "మీకు కూడా అవకాశం వస్తే?" నటి రాసింది. అభిమాని ఒకరు, "నాకు అవకాశం ఉంటే నేను మీకు విందు తీసుకెళ్తాను" అని రాశాడు. నటి తన తదుపరి చిత్రాన్ని ఇంకా ధృవీ కరించలేదు.

విశ్వంవాయిస్
తెలుగుదినపత్రికలో
వెలువడుతున్న ప్రత్యేక శీర్షికలు

భక్తి వాయిస్
బిజినెస్ వాయిస్
సినీ వాయిస్
క్రైం వాయిస్
కెరీర్ వాయిస్
క్రీడా వాయిస్
హెల్త్ వాయిస్
కిడ్స్ వాయిస్
కిసాన్ వాయిస్
సక్సెస్ వాయిస్
తీర్పు వాయిస్
వనిత వాయిస్
విద్యా వాయిస్

VISWAM VOICE Telugu Daily: Edited, Printed, Published and Owned by **KHANDAVELLI SUNIL KUMAR,** H.No:3-168, Pedda Brahmamgariveedi, Rayavaram, Rayavaram (M), East Godavari District, Andhra Pradesh. Pin:533346. Ph:092460 33999, 9238823333, 8099966647, Printed at Kumar Publication, H.No.9-125, Indiramma Colony, Rayavaram, Rayavaram(M), East Godavari District, Andhra Pradesh. Pin:533346, Editor: **KHANDAVELLI SUNIL KUMAR.** RNI No: APTEL 2017/73603, viswamvoice@gmail.com